

కంటిచూపు లేనివాడు
గుడ్డివాడు కాదు
తన తప్పులను తెలుసుకోలేనివాడే
నిజమైన గుడ్డివాడు.
- మహాత్మా గాంధీ.


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 193 | శనివారం 03 జనవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi





## తెలుగును కాపాడుకుందాం

**- విజయవాడ పుస్తక మహోత్సవంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ నరసింహ**

విజయవాడ - సూర్య వాస్తవం

ఆంగ్ల మాధ్యమ ప్రభావం నుండి తెలుగు భాషను కాపాడుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ అన్నారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో 36వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని ప్రధాన అతిథిగా హాజరైన ఆయన శుక్రవారం సాయంత్రం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందరరేగా జరిగిన సభలో జస్టిస్ శ్రీ నరసింహ మాట్లాడుతూ ప్రతి మంచి పుస్తకానికీ తనదైన వ్యక్తిత్వం, జీవలక్షణం ఉంటాయన్నారు. చాలా పుస్తకాలు అల్పాయువులని, కొన్ని పుస్తకాలు చిరాయువులని తెలిపారు. పుస్తకాలు పాఠకులతో తమదైన బాంధవ్యాన్ని పెంపొందించుకుంటా యన్నారు. తన

- మిగతా 2లో..

## ఫిబ్రవరి 5న బండ్లపల్లికి కాంగ్రెస్ నేతలు?

**- జనవరి 5 నుండి రాష్ట్రవ్యాప్త ప్రచారోద్యమం**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్ఆర్ఇజిఎ) కేంద్రం రద్దు చేసిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 5న ఎంజిఎన్ఆర్ఇజిఎ బచావో ఆందోళన్ చేపట్టాలని కాంగ్రెస్ ప్రతిపాదించింది. అందులో భాగంగా పార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ,

- మిగతా 2లో..



## ఎప్పటిలానే పేదల మృతిపై మౌనం వహించిన ప్రధాని

**- లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:

పేదలు మరణించినపుడల్లా ఎప్పటిలానే ప్రధాని మోడీ మౌనం వహించారని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో నీటి కాలుష్యం కారణంగా పది మంది మరణించిన సంగతి తెలిసిందే ఈ ఘటనపై

- మిగతా 2లో..



## కొందరి కడుపుల్లో విషం

- అది మూసీ కాలుష్యం కంటే ప్రమాదకరం
- వికారాబాద్ అడవుల్లో వదిలేస్తే వారి మనస్సులు బాగుపడతాయి
- ఓ పక్క మూసీ..మరోపక్క ఫ్లోరైడ్‌తో నల్లగొండ జిల్లా ప్రజలకు శిక్ష
- గోదావరి నుంచి 20 టీఎంసీలు తీసుకొస్తాం
- తాగునీటి అవసరాల కోసం 15 టీఎంసీలు వాడుతాం
- మూసీలో ఐదు టీఎంసీలను నిరంతరం పారిస్తాం
- మూసీ ప్రక్షాళనపై పూర్తి డీపీఆర్ వచ్చాక చర్చిస్తాం
- అందరి అభిప్రాయాలు తీసుకుని ముందుకెళ్తాం
- గుజరాత్‌లో సబర్మతీ ప్రక్షాళనలో 60 వేల కుటుంబాల తరలింపు
- గుజరాత్, యూపీల్లో బీజేపీ ప్రభుత్వాలు నదుల ప్రక్షాళన చేస్తుంటే అడ్డుకుంటున్నామా?
- తెలంగాణలో బీజేపీ ఎందుకు అడ్డుకుంటున్నది?
- రియల్ ఎస్టేట్ ఒక ఇండస్ట్రీ..మౌలిక సదుపాయాలు కల్పిస్తాం - హైదరాబాద్ నగరం ఓల్డ్ సిటీ కాదు ఒరిజినల్ సిటీ - మూసీ పునరుజ్జీవంపై శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్- సూర్య వాస్తవం

'మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపుల్లో దాగి ఉన్న విషం అత్యంత ప్రమాదకరం. ఎందుకు విషం కక్కుతున్నారు. వారి కండ్లల్లోనూ విషముంది. వాటితో చూస్తే ఖతమే. దానిని కప్పిపుచ్చుకోవడానికి కండ్లద్దాలు పెట్టుకుంటున్నారు. వివరాలు చెబుతుంటే కోపం ఎందుకు వస్తుంది? మీ సభ్యులైన అంబర్‌పేట్, ఉప్పల్ ఎమ్మెల్యేలు సహకరిస్తమంటున్నారు. వారిని చూసైనా బుద్ధి తెచ్చుకోండి. అసలు మీరు మూసీ ప్రక్షాళన చేయాలంటున్నారా? వద్దంటున్నారా? చెప్పండి. వాళ్లకు చేయొద్దని ఉంది. అంబర్‌పేట శ్మశానవాటిక నుంచి మృతదేహాలు కొట్టుకొస్తుంటే, కంపెనీల కాలుష్యం వస్తుంటే దాని మధ్యే పేదలు ఎల్లకాలం నివసించాలా? ఇది మీకు పట్టదా? కాంట్రాక్టులు ఇచ్చుడు..కమీషన్లు కొట్టుడు..ఫామ్‌హౌజ్‌లలో పోయి పండేటోళ్లకు నా గురించి మాట్లాడే అర్హత లేదు. మేం 80 వేల పుస్తకాలు చదవలేదు. డీపీఆర్ పూర్తయ్యాక మూసీ ప్రక్షాళనపై సభలో చర్చిస్తాం. అందరి అభిప్రాయాలు



తీసుకుంటార. హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని ఎమ్మెల్యేలతో మాట్లాడుతాం.

ఇలా అందరి అభిప్రాయాలను తీసుకునే ముందుకెళ్తాం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. 'గుజరాత్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్‌కోసం అక్కడి బీజేపీ ప్రభుత్వం

- మిగతా 2లో..



## ప్రతిపాదిత పెట్టుబడుల్లో రాష్ట్రం అగ్రగామి

**- మంత్రి నారా లోకేష్**

అమరావతి - సూర్య వాస్తవం

దేశ వ్యాప్తంగా ప్రతిపాదిత పెట్టుబడుల్లో రాష్ట్రం అగ్రగామిగా ఉందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో దేశ వ్యాప్తంగా ప్రతిపాదిత మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం వాటాను రాష్ట్రం దక్కించుకుందని బ్యాంక్ ఆఫ్ బరోడా తాజా నివేదిక వెల్లడించిందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం వెనుకబడటం లేదని, ముందుకు దూసుకుపోతోందని పేర్కొన్నారు.

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## భూ వివాదాలు లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు

- ఏపీలో ప్రారంభమైన కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ
- నేతల చిత్రాలు లేకుండా రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో ముద్రణ
- రీసర్వే పూర్తయిన గ్రామాల్లో 22 లక్షల పుస్తకాల పంపిణీ
- జనవరి 9 వరకు కొనసాగనున్న ప్రత్యేక కార్యక్రమం
- ఒకరోజు పంపిణీలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి - సూర్య వాస్తవం

ప్రజలకు భూ వివాదాలు లేకుండా, రికార్డుల్లో తప్పులు లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు. విదేశీ పర్య టనలో ఉన్న ఆయన శుక్రవారం రాష్ట్ర మంత్రులతో టెలీకానారేన్స్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నూతన సంవత్సర కానుకగా రాజముద్రతో కూడిన 22 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలతో గ్రామంలో



రెవెన్యూ సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయ న్నారు. వివాదాలు లేని స్థలాలను కూడా రీసర్వే పేరుతో అడ్డదిడ్డంగా చేసి వివాదాస్పదంగా చేశారన్నారు. భూమే ప్రాణంగా బతికే రైతులకు

- మిగతా 2లో..

## నేటి నుంచి గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభ

- రేపు మారిషస్ అధ్యక్షులు ధరమ్‌బీర్ గోకుల్ రాక
- 5న సిఎం చంద్రబాబు నాయుడు హాజరు

2లో






## చంద్రబాబు మౌనంగా ఉండడం దారుణం

- ఉపాధి హామీపై కేంద్రం కుట్ర పన్నుతోందని షర్మిల ఆరోపణ
- సీఎం చంద్రబాబు ఏమీ మాట్లాడడం లేదంటూ తీవ్ర విమర్శలు
- 'జీ రామ్ జీ' చట్టంతో రాష్ట్రంపై రూ.4,500 కోట్ల భారం పడుతుందని వెల్లడి
- మోదీ చేతిలో చంద్రబాబు తోలుబొమ్మలా మారారంటూ ఘాటు వ్యాఖ్యలు
- కొత్త చట్టాన్ని రద్దు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కూటమికి డిమాండ్

అమరావతి - సూర్య వాస్తవం

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంపైనా, కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై కేంద్రం కుట్రలు చేస్తుంటే, సీఎం చంద్రబాబు మౌనంగా ఉండటం దారుణమని ఆమె మండిపడ్డారు.

- మిగతా 2లో..

# చంద్రబాబు మౌనంగా ఉండడం దారుణం

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ తెస్తున్న నల్ల చట్టాలకు రాష్ట్ర ప్రభుత్వం చప్పట్లు కొట్టడం అత్యంత సిగ్గుచేటని విమర్శించారు.

షర్మిల మాట్లాడుతూ, "గ్రామీణ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఊతమిచ్చింది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో దేశంలోనే తొలి జాబ్ కార్డును మన రాష్ట్రంలోనే అందించాం. ఈ పథకం ద్వారా ఏటా 80 లక్షల మంది పేదలకు ఉపాధి హక్కుగా మారింది" అని వెల్లడించారు. దేశంలోనే ఈ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుంటున్న రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందని తెలిసినా, కేంద్రం 'జీ రామ్ జీ' పేరుతో కొత్త చట్టం తీసుకొచ్చి దానికి గండి కొడుతోందని ఆరోపించారు. ఈ అక్రమ చట్టంతో రాష్ట్రంపై ఏటా రూ.4,500 కోట్ల భారం పడుతుందని, ఈ నిజాన్ని తెలిసి కూడా చంద్రబాబు ఏమీ మాట్లాడకుండా ఉండడం బాధాకరమన్నారు. "గోరుచుట్టుపై రోకలి పోటులా ఈ కొత్త చట్టం మారింది. ఇప్పటికే ప్రతినెలా జీతాలు ఇవ్వడానికే అప్పులు చేసే ప్రభుత్వం, ఈ పథకానికి అవసరమైన 40 శాతం నిధులను ఎక్కడి నుంచి తెస్తుంది?" అని షర్మిల ప్రశ్నించారు. నిరుద్యోగంలో నంబర్ వన్ గా ఉన్న రాష్ట్రంలో ఉపాధికి ఉరి పెడుతుంటే ప్రజలకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. "మీరు రాష్ట్రానికి ముఖ్యమంత్రా లేక మోదీ చేతిలో తోలుబొమ్మనా?" అని చంద్రబాబును ఉద్దేశించి ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఉపాధి హామీ పథకానికి ఊపిరి తీస్తున్న 'జీ రామ్ జీ' చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కూటమి పార్టీలను ఆమె కోరారు. పాత నరేగా చట్టాన్ని పునరుద్ధరించేలా బేషరతుగా మద్దతు పలకాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, కూటమి పార్టీల నిర్లక్ష్యాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఎండగడుతుందని షర్మిల హెచ్చరించారు.

# ఫిబ్రవరి 5న బండ్లపల్లికి కాంగ్రెస్ నేతలు?

(మొదటిపేజీ తరువాయి)

మల్లికార్జునఖర్గే అనంతపురం జిల్లాలోని నార్పల మండలం బండ్లపల్లి గ్రామాన్ని సందర్శించే అవకాశం వుంది. 20ఏళ్ల క్రితం ఈ చారిత్రక పథకాన్ని ప్రారంభించిన గ్రామం అది. సోనియా గాంధీ, అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో 2006 ఫిబ్రవరి 2న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఆ సమయా నికి వారు ఇక్కడ పర్యటించాలని ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి ప్రతిపాదించారు. దీన్ని పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిశీలి స్తోంది. 'కార్మికుల హక్కులను ప్రభుత్వ భిక్షగా మార్చడానికి' మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 5న దేశవ్యాప్త ఆందోళనకు కాంగ్రెస్ సిద్ధమైన నేపథ్యంలో ఈ ప్రతిపాదన ప్రాముఖ్యతను సంతరించుకుంది.

ఉపాధి హామీ అమలును బలోపేతం చేయాలని, గ్రామీణ కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరుతూ జనవరి 5న రాష్ట్రవ్యాప్తంగా ప్రచారోద్యమాన్ని ప్రారంభించాలని అన్ని జిల్లా, మండల, గ్రామస్థాయి నేతలకు ఎపి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఇండియా బ్లాక్ భాగస్వాములతో, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, యువజన, మహిళా విభాగాల సమన్వయంతో అందరూ విస్తృతంగా పాల్గొనేలా ఈ ప్రచారోద్యమాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఈ ఉద్యమంలో భాగంగా జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పార్టీ నేతలు, కార్యకర్తలు కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపడతారు. విబి-జి ఆర్ఎఎం జిపై ఆ వేదిక ద్వారా ఫిర్యాదులు అందజేస్తారు. శాంతియుతంగా నిరసనలు చేపడతారు.

# ఎప్పటిలానే పేదల మృతిపై మౌనం వహించిన ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)

రాహుల్‌గాంధీ శుక్రవారం ఎక్స్ వేదికగా కేంద్రాన్ని నిలదీశారు. ఇండోర్‌లో నీటికి బదులు విషం పంపిణీ చేయబడిందని, అయినా మోడీ ప్రభుత్వం మొద్దునిద్రపోతోందని అన్నారు. ఇండోర్‌లోని ప్రతి ఇల్లు శోక సంద్రంగా మారిందని అన్నారు. పేదలు నిస్సహాయులు కావడంతో బిజెపి నేతలు అహంకారపూరిత ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ జీవితాలను మరియు జీవనోపాధిని కోల్పోయిన వారికి ఓదార్పు అవసరమనీ, కానీ మోడీ ప్రభుత్వం అహంకారాన్ని ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు. నీరు మురికిగా ఉందని, దుర్వాసన వస్తోందని ప్రజలు పదే పదే ఫిర్యాదు చేసినా ఎందుకు వినిపించుకోవడం లేదని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. త్రాగునీటిలో మురికి నీరు ఎలా కలుస్తుందని, సకాలంలో ఎందుకు సరఫరా నిలిపివేయలేదని, బాధ్యులైన అధికారులు, నేతలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. ఇవి సామాన్య ప్రశ్నలు కాదని, ప్రజలు జవాబుదారీతనం కోరుతున్నారని అన్నారు. స్వచ్ఛమైన నీరు అవసరం కాదని, అది జీవించే హక్కు అని అన్నారు. బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం, దాని నిర్లక్ష్య యంత్రాంగం, మొద్దు నిద్రపోతున్న అధికారులు ఈ హక్కు నిర్వీర్యానికి పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ప్రస్తుతం మధ్యప్రదేశ్ దుష్పరిపాలనకు కేంద్రంగా మారిందని అన్నారు. దగ్గు మందుతో చిన్నారుల మరణాలు, ప్రభుత్వాస్పత్రుల్లో ఎలుకలు పిల్లలను చంపడం, ఇప్పుడు కలుషిత నీటి మరణాలు. ఎప్పటిలానే పేదలు మరణించినప్పుడల్లా ప్రధాని మోడీ మౌనంగా ఉంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రతిపాదిత పెట్టుబడుల్లో రాష్ట్రం అగ్రగామి

(మొదటిపేజీ తరువాయి)

ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం) రాష్ట్రాలను వెనక్కునెట్టి ముందంజలో నిలిచిందని పేర్కొన్నారు. నిరంతరం సంస్కరణలు, వేగవంతమైన నిర?యాలు, పెట్టుబడిదారుల పట్ల స్పష్టమైన నిబద్ధతకు ఇదే ఫలితమని తెలిపారు. దీని ద్వారా దేశంలోని పారిశ్రామిక, పెట్టుబడి దిశ తూర్పు నుంచి దక్షిణ రాష్ట్రాల వైపు మళ్లుతున్నట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా ప్రకటించిన మొత్తం మూలధన పెట్టుబడుల్లో 51.2 శాతం కేవలం మూడు రాష్ట్రాల్లోనే కేంద్రీకృతమై ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిపాదిత పెట్టుబడి ప్రకటనలు రూ.26.6 లక్షల కోట్లకు చేరాయన్నారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు అనుకూల పాలన, అనుమతుల మంజూరులో వేగం, రంగాలవారీ విధానాలు, పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్, ఇంధనం, డిజిటల్ మౌలిక వసతులపై భారీ పెట్టుబడులు ఈ విజయానికి ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు.

# కొందరి కడుపుల్లో విషం

(మొదటిపేజీ తరువాయి)

60 వేల కుటుంబాలను తరలించింది. యూపీలో గంగా ప్రక్షాళన చేపట్టారు. ఇప్పుడు ఢిల్లీలో యమునా నది ప్రక్షాళన కోసం పని మొదలుపెట్టారు. గుజరాత్, యూపీ, ఢిల్లీలో కాంగ్రెస్ ఏమైనా అడ్డుకున్నదా? బీజేపీ వాళ్లు ఇక్కడ ఎందుకు అడ్డుకుంటున్నారు?' అని సీఎం ప్రశ్నించారు. రెండు రోజుల విరామం అనంతరం శీతాకాల సమావేశాలు పున:ప్రారంభం అయ్యాయి. ఉదయం 10 గంటలకు ప్రశ్నోత్తరాలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మూసీ నది పునరుజ్జీవంపై బీఆర్ఎస్ పక్ష ఉపనేత హరీశ్‌రావు, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సభ్యులు బాలూనాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి, దానం నాగేందర్, శంకర్, కాలేరు వెంకటేశ్, రామ్మోహన్‌రెడ్డి, పాయల్ శంకర్ మాట్లాడారు. వారికి శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమాధానం ఇచ్చే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని మాట్లాడారు. మూసా, ఈసా నదుల సంగమం వద్ద మహాత్మా గాంధీ అస్థికలు కలిపిన చోట బాపూఘాట్ నిర్మించారనీ, కాకతీయుల నుంచి నిజాం నవాబుల వరకు సాగు, తాగు నీటి అవసరాలతో పాటు పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధికి అనుగుణంగా ప్రాజెక్టులు కట్టారని గుర్తుచేశారు. హైదరాబాద్ నగరానికి శాశ్వత వరద సమస్య పరిష్కారానికి నిజాం సర్కారు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులను నిర్మించిందని తెలిపారు. అవి ఇప్పటికీ హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. ఆ గత శ్రీమంతుల ఫామ్‌హౌజ్‌ల డ్రయినేజీని ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లలో కలుపుతుంటే ఉక్కుపాదం మోపి అడ్డుకున్నామన్నారు. తనను రియల్ ఎస్టేట్ బ్రోకరని, ఇంకా ఏదేదో అని విమర్శలు చేస్తున్నా పట్టించుకోకుండా ముందుకెళ్తున్నామని చెప్పారు. రియల్ ఎస్టేట్ కూడా ఒక ఇండస్ట్రీ అనీ, దానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీనిచ్చారు. ప్రపంచస్థాయి నగరాలన్నీ నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకుంటున్నాయనీ, లండన్ థేమ్స్ రివర్, న్యూయార్క్, జపాన్, సౌత్ కొరియా, సింగపూర్ పర్యటనల్లో తమకు ఇదే అర్థమైందని తెలిపారు.

మూసీ కాలుష్యం కారణంగా నల్లగొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని సీఎం అన్నారు. ఒకప్పుడు అదే నీళ్లు తాగిన అక్కడి ప్రజలు ప్రస్తుతం కంపెనీల కలుషితాల నుంచి జంతువుల కళేబరాలు కలిసి వచ్చే నీళ్లతో అనారోగ్యాల పాలవుతున్నారనీ, మూసీ పరివాహక ప్రాంతంలో పండే పంటలు, కూరగాయలు తిన్న మహిళలు గర్భం దాల్చలేకపోతున్నారని వైద్యుల నివేదికలు ఎత్తిచూపుతున్నాయని వివరించారు. మూసీని ప్రక్షాళన చేయాలని నల్లగొండ జిల్లా ప్రజలు తమను వేడుకున్నారన్నారు. ఆ జిల్లా ప్రజల మాటలను విన్నాక, ప్రపంచ నగరాలను చూశాక మూసీలో శుద్ధమైన నీటిని ప్రవహింపజేయాలనే నిర?యానికి వచ్చామన్నారు. కన్సల్టెన్సీలను నియమించుకుని మూసీ ప్రక్షాళనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పామనీ, ఈసా, మూసా కలిసే బాపూఘాట్ వద్ద వీ షేప్‌లో గాంధీ సరోవర్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. గోదావరి జలాలను తరలించి మూసీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనుకుంటున్నామని తెలిపారు.

అక్కడ నుంచి 20 టీఎంసీలను తరలించి అందులో 15 టీఎంసీలు నగర అవసరాలకు, మిగతా ఐదు టీఎంసీలను మూసీలో నిరంతరం ప్రవహింపజేసేందుకు వాడుతామని వివరించారు. గాంధీ సరోవర్‌కు మార్చి 31 లోగా అంచనాలు సిద్ధం చేసి టెండర్లు వేసి అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు రూ.4 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించిందనీ, గాంధీ సరోవర్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి కూడా లభించిందని తెలిపారు. 200 ఎకరాలను అడగ్గా ఇప్పటికే రక్షణ శాఖకు చెందిన 55 ఎకరాలను కేంద్రం ఇచ్చిందనీ, మిగతాది కూడా ఇచ్చేందుకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సూత్రపాయ అంగీకారం తెలిపారని చెప్పారు. గత పాలకుల మాదిరిగా కేసుల నుంచి తప్పించుకోవడానికి కేంద్రంతో సఖ్యతగా ఉండట్లేదనీ, రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతతో మెలుగుతున్నామని స్పష్టం చేశారు. తమది హిడెన్ ఎజెండా కాదనీ, అభివృద్ధి ఎజెండా అని తెలిపారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని భావిస్తున్నామని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో నైట్ ఎకానమీని అభివృద్ధి చేస్తామన్నారు.

అనారోగ్యం బారిన మూసీ పరివాహక ప్రజలు

పాతబస్తీని తామెప్పుడూ నిర్లక్ష్యం చేయలేదనీ, ఓల్డ్‌సిటీ ఒరిజినల్ సిటీ అని సీఎం నొక్కి చెప్పారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు సైబరాబాద్ సిటీకి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే పునాది వేసిందని చెప్పారు. రాబోయే 20 ఏండ్లలో పట్టణీకరణ 75శాతానికి పెరుగుతుందన్నారు. మూసీ ప్రక్షాళన చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కోరుతున్నారని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంత పేదలకు మెరుగైన వసతులు కల్పిస్తామంటే వాళ్లు అలాగే ఉండాలన్నట్లుగా విపక్షం ప్రవర్తిస్తున్నదని విమర్శించారు. మంచిరేవుల దగ్గర మూసీ పరివాహకంలో ఉన్న పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేస్తామనీ, అట్లాగే మూసీ పరివాహక ప్రాంతంలో గురుద్వార్, మసీదు, చర్చిలను నిర్మించి మత సామరస్యాన్ని చాటబోతున్నామని తెలిపారు. డీపీఆర్ సిద్ధమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. గ్రేటర్ ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల్లో ఏం అభివృద్ధి కావాలో చెప్పాలన్నారు. మూసీ పరివాహక ప్రాంతం నుంచి తరలించే పేదలకు బ్రహ్మాండమైన కాలనీలు నిర్మిస్తామనీ, మెరుగైన వసతులు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనే తమ సంకల్పానికి సహకరించాలని ప్రజలను కోరారు. ప్రతిపక్ష నేతలు కడుపుల్లో విషం పెట్టుకుని మాట్లాడొద్దని చురకలు అంటించారు. బహుషా వారి మనస్సులు బాగు కావాలంటే వికారాబాద్ అడవుల్లో కొంత కాలం విడిచిపెడితే బాగుంటుందేమో అని వ్యాఖ్యానించారు.

# భూ వివాదాలు లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు

(మొదటిపేజీ తరువాయి)

భూ సమస్యలు లేకుండా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం అసంబద్ధంగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజలకు అభద్రతను దూరం చేశామన్నారు. పాస్‌పుస్తకాల పంపిణీ ప్రతి ఇంట్లో కొత్త సంతోషాన్ని తెస్తోందన్నారు. పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్దిష్ట సమయాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలన్నారు. మంత్రులు, జిల్లా కలెక్టర్లు ఈ విషయంలో ఎక్కువ చొరవ చూపాలన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఏదో ఒక రోజు తాను స్వయంగా పాల్గొంటానన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి షెడ్యూల్ ప్రకటించినట్లు తెలిపారు. తొలిరోజు పంపిణీ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర వ్యాప్తంగా వారి వారి నియోజకవర్గాల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. వేలాది గ్రామాల్లో ఈ కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రికి మంత్రి వివరించారు.

**పాస్ పుస్తకాల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడండి : సిఎస్**

రాష్ట్రంలో రెవెన్యూ సంబంధిత సమస్యలను వీలైనంత వరకు తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం సక్రమంగా జరిగేలా చూడాలని సిఎస్ కె విజయానంద్.. జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రైల్వే అండర్ బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వేలకు సంబంధించి పెండింగ్ భూ సేకరణ కేసులకు సంబంధించిన అంశాలు, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, ప్రజల సంతృప్తి, డాక్యుమెంట్ల అప్‌లోడ్ అంశాలపై శుక్రవారం సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కానారేన్స్ నిర్వహించారు.

రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పాస్‌పుస్తకాలను పంపిణీ చేసేందుకు 23 లక్షలు ముద్రించి పంపిణీ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రైతుల వద్దనున్న పాత పాస్‌పుస్తకాలను తీసుకుని వాటి స్థానంలో కొత్తవి పంపిణీ చేయడంతోపాటు పాత పుస్తకాలను మనుగడలో లేకుండా చేయాలని ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి క ృష?బాబు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా రైల్వే లెవెల్ క్రాసింగ్‌లను తొలగించి వాటి స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు లేదా రైల్వే అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని ప్రధాని నిర?యించారని తెలిపారు. రాష్ట్రంలో ఇంకా 766 రైల్వే లెవెల్ క్రాసింగ్స్ ఉండగా, వాటిలో ఆర్అండ్‌బి రహదారులపై 329, పంచాయతీరాజ్ రోడ్లు వెంబడి 319 ఉండగా మిగతావి ఇతర రహదారులపై ఉన్నాయన్నారు. ఇప్పటికే 363 ఆర్ఒబి, ఆర్‌యుబిలు మంజూరు కాగా, మరో 403 మంజూరు కావాల్సి ఉందన్నారు.

# తెలుగును కాపాడుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

విద్యాభ్యాసమంతా ఆంగ్లమాధ్యమం లో జరిగినా తండ్రి సూచనల మేరకు తెలుగు చదవడం, రాయడం నేర్చుకున్నానని తెలిపారు. పుస్తకాలు చదవడం అనే సంస్కృతిని తర్వాతితరాలకు అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కె.రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ తెరలపై పుస్తకాలను చదవడం అంత రసవత్తరమైన అనుభవం కాదన్నారు. అందుకే నిజమైన పాఠకులంతా మళ్లీ పుస్తకాలవైపు మళ్లుతున్నారని తెలిపారు. రాష్ట్ర రాజధానిలో పుస్తక మహోత్సవానికి స్థలం కేటాయించే అంశాన్ని సానుకూలంగా పరిశీలించేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రముఖ సాహితీవేత్త, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ పుస్తక ప్రచురణకర్తలు రచయితలకు పురుడుపోసే మంత్రసానిలాంటివారని పేర్కొన్నారు. ఆధునిక ఎలక్ట్రానిక్ మాధ్యమాలు పుస్తకాలకు ప్రత్యామ్నాయాలు కాలేవన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన సిపిఐ జాతీయ నాయకులు కె.నారాయణ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమమే స్వాతంత్ర్యోద్య మానికి దారి తీసిందని గుర్తుచేశారు. స్వరాజ్య మైదానాన్ని పుస్తక మహోత్సవానికి, ప్రజలకు దూరం చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ పత్రికా సంపాదకులు కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ పుస్తక పఠనం పట్ల యువతలో ఆసక్తి పెరుగుతోందన్నారు. పాత్రికేయులు, కవి అప్పరసు క ృషా?రావు మాట్లాడుతూ అనాదిగా సమాజాన్ని ముందుకు నడిపిస్తున్న ఘనత పుస్తకాలకే దక్కుతుందని, సమాజం, శాస్త్రవిజ్ఞానం, వ్యవస్థల పనితీరును, పరిణామక్రమాన్ని అద్దం పడుతూనే భవితకు మార్గదర్శనం చేయగల శక్తి పుస్తకాలకు ఉందని పేర్కొన్నారు. పుస్తక మహోత్సవ కమిటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య స్వాగతోపన్యాసం చేశారు. కన్వీనర్ డి.విజయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. అధ్యక్షులు టి.మనోహర్ నాయుడు వందన సమర్పణ చేశారు.

# నేటి నుంచి గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభ

**గుంటూరు - సూర్య వాస్తవం**

గుంటూరులో శని, ఆది, సోమ వారాల్లో ప్రపంచ తెలుగు మహాసభలు జరగనున్నాయి. గుంటూరు - చిలకలూరిపేట జాతీయ రహదారిపై ఏటుకూరు బైపాస్ వద్ద శ్రీ సత్య సాయి స్పిరిట్యుయల్ సొసైటీ సిటీ ప్రాంగణంలో ఈ వేడుకలు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం ప్రారంభ సభలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమీడిఘనటం నరసింహం, శాసన సభ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొంటారు. ఈ నెల 4న ఉదయం 10 గంటలకు జరిగే సభలో మారిషస్ అధ్యక్షులు ధరమ్‌భీర్ గోకుల్ హాజరు కానున్నారు. 5న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ సభ జరగనుంది. అన్నమయ్య కీర్తనల సహస్ర గళార్చనతో మహాసభ ప్రారంభం అవుతుందని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు, నిర్వాహకులు కెసిరాజు (గజల్) శ్రీనివాస్ తెలిపారు. తెలుగు మహాసభ ప్రాంగణం ఏర్పాటు చేసిన మరో అయిదు ఉప వేదికలపై సన్మానాలు, సాహితీ సదస్సులు, కవి సమ్మేళనాలు, తెలుగు గీతాలాపనలు వంటి అనేక తెలుగుదనం ఉట్టిపడే కార్యక్రమాలు రాత్రి 11 గంటల వరకు జరగనున్నాయని చెప్పారు. శనివారం సాయంత్రం సభకు ముఖ్య అతిథిగా ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్.మానవేంద్ర రారు, విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురంధేశ్వరి, శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ తదితరులు పాల్గొననున్నారు. ఏర్పాట్లను, భద్రత వ్యవహారాలను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పి వకుల్ జిందాల్, ఇంటిల్ జెన్సు సెక్యూరిటీ ఎస్పి ఆరీఫ్ హాఫీజు, పలువురు అధికారులు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు.

# సంపాదకీయం

## రసవత్తరంగా బెంగాల్ రాజకీయం



పశ్చిమ బెంగాల్ ప్రస్తుతం ఒక నిర్ణయాత్మక రాజకీయ పర్వంలో ఉంది. 2026 అసెంబ్లీ ఎన్నికలకు రాష్ట్రం సిద్ధమవుతోంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ 2011లో లెఫ్ట్ ఫ్రంట్‌ను ఓడించినన తర్వాత తొలిసారిగా రాష్ట్ర రాజకీయ వాతావరణం కాస్త గందరగోళంగా, అస్థిరంగా ఉంది. ఒకప్పుడు మమతా బెనర్జీకి ఎదురులేదు. ఆమె వ్యక్తిత్వం, మార్పు తీసుకు వస్తానన్న ఆమె వాగ్దానం చుట్టూ తిరిగిన రాజకీయ కథనం ప్రస్తుతం మరింత గందరగోళాన్ని ప్రతిబింబిస్తోంది. 15 సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఎంసి సర్కార్‌కు ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగానే ఉంది. ఇక బిజెపి రాష్ట్రంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఒకప్పుడు దాదాపు కనుమరుగైన స్థితినుంచి వామపక్షాలు కోలుకుని కాస్త తమ ఉనికిని చాటుకుంటున్నాయి. ఇక కోల్‌కతా సివిల్ పోల్స్ ఫలితాలు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రోడ్ షోలు సంస్థాగత జోక్యం, రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో మారుతున్న రాజకీయ సెంటిమెంట్లు రాబోయే ఎన్నికల ఫలితాలు 2021 మాదిరిగా ఉండబోవని సూచిస్తున్నాయి. ఈసారి ఎన్నికల్లో రాజకీయచిత్రం మారవచ్చు. త్రిముఖ పోటీలే ఉండవచ్చు. ప్రతి పార్టీ మరో పార్టీతోనే కాక, సొంత పార్టీలో తిరుగుబాటుదారులతో గట్టి పోటీ ఎదుర్కొనే పరిస్థితి రావచ్చు. 15 ఏళ్ల పాలన ప్రభుత్వ వ్యతిరేకతనే కాదు పాలకులకు అలసటను కూడా తెస్తుంది. ప్రభుత్వ నియామకాల్లో అవినీతి ఆరోపణలు, స్థానిక విద్యుత్ బ్రోకర్లపై పెరుగుతున్న ఆగ్రహం, సంక్షేమ పథకాల లబ్ధి పంపిణీలో రాజకీయ జోక్యంపై ఆందోళనలు ఉండనే ఉన్నాయి. ఒకప్పుడు భావోద్వేగశక్తిగా, విప్లవాత్మకంగా భావించిన మా మాటీ -మనుష్ కథనం ఆరోపణలకు కేంద్రంగా మారింది. అధికార వికేంద్రీకరణ వల్ల కొన్ని చోట్ల నియంత్రణ మరింత కఠినంగా మారింది. అయినా, బెంగాల్‌లో ప్రభుత్వ వ్యతిరేకత అంత తీవ్ర స్థాయిలో లేదు. వ్యవస్థపై అసంతృప్తి ఉన్నా, మమతా బెనర్జీని తిరస్కరించే అంతగా మారలేదు. రాష్ట్రంలో పేద కుటుంబాలకు అండగా మమతా ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్ష్మీ భండార్, కన్యశ్రీ, స్వాస్థ్యా సతి, రూపశ్రీ వంటి సంక్షేమ పథకాలు ఆమెకు వ్యక్తిగతంగా తిరిగి అధికారం అందించే గ్యారంటీగా నిలుస్తున్నాయి. బెంగాల్‌లో ఉన్న సెంటిమెంట్ ప్రభుత్వంలో మార్పును డిమాండ్ చేసే స్థాయిలో లేదు. టిఎంసి ప్రభుత్వం స్థానిక నాయకత్వంపై వస్తున్న ఆరోపణలను చక్కదిద్ది, సజావుగా సంక్షేమం అందేటట్లు చూడగలమని ఒప్పించాలి. ప్రభుత్వం మనుగడ సాగించాలంటే ఇది తప్పదు. మమతా బెనర్జీ ప్రజలలో విశ్వాసాన్ని పునరుద్ధరించి, అధికారం తిరిగి చేజిక్కించుకునేందుకు తగిన విధంగా మార్చగలరా అన్నదే అధికార పార్టీ ఎదుర్కొంటున్న ప్రశ్న. కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో సంక్లిష్టతకు తగిన సమాధానం దొరికింది. టిఎంసి విజయం సాధించి మహా నగరంపై తన నియంత్రణ నిలుపుకుంది. పాలక పార్టీకి ప్రస్తుతానికి ముఖ్యమైన ఆధిక్యత లభించింది. కోల్‌కతా కేవలం ఓ నగరం కాదు. రాజకీయంగా బలమైన ఘనమైన అడ్డా. దానిని నిలుపుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో విమర్శలు, ఎన్నికలలో ఓటర్ల మద్దతు తగ్గుతుందన్న వాదనలో అర్థం లేదనే ప్రభుత్వ ధీమాకు బలం చేకూరింది. బిజెపికి సంబంధించినంత వరకూ స్థానిక ఎన్నికలు ఆ పార్టీ సంస్థాగత లోపాలను బయటపెట్టాయి. గత పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ దీటైన బలాన్ని ప్రదర్శించినా, నగర రాజకీయాల యంత్రాంగంలో తనను మమేకమైపోయేందుకు చేస్తున్న కృషిలో అది చాలా కష్టపడింది. వార్డు స్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం కాకపోవడం అభ్యర్థుల ఎంపికలో లోపాల వల్ల బిజెపి చెప్పినంత బలంగా తనను తాను నిరూపించుకోలేకపోయింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదేపదే పర్యటనలు, రోడ్ షోలు, ఘనమైన ప్రసంగాలు, ఈ లోపాన్ని సవరించడమే లక్ష్యంగా పెట్టుకుని సాగాయి. బెంగాల్‌ను కైవసం చేసుకోవడం తమ పరిధికి మించిన పనిగా అంగీకరించేందుకు బిజెపి ఇష్టపడడం లేదని ఆయన ఉనికి సూచిస్తోంది. ఈ రోడ్ షో వల్ల రెండు ప్రయోజనాలు. అవి పార్టీ కేడర్‌ను ఉత్తేజపరుస్తాయి. కేంద్ర నాయకత్వం తమకు రాష్ట్రంలో అండగా ఉందని మద్దతుదారులకు భరోసా కల్పిస్తాయి. అయినా, రాష్ట్రంలో నమ్మకమైన నాయకత్వం నిర్మాణంలో, అంతర్గత వర్గ వివాదాలు, అస్థిరతను చక్కదిద్దడంలో ఇటువంటి ప్రయోగాలు ఏమాత్రం పనిచేస్తాయనే ప్రశ్న మిగిలే ఉంది. బిజెపి ప్రచారం ఎక్కువగా శాంతి భద్రతలు పరిరక్షణ, రాజకీయ హింసను నిర్మూలన, సుస్థిరమైన పాలన వంటి వాగ్దానాలకే పరిమితమైంది. అయితే, దానిని విజయం అది ఏ మేరకు బెంగాల్ నిర్దుష్ట మోడల్ పాలన అందించగలదనే అంశంపైనే ఆధారపడి ఉంది. మరో పక్క, లెఫ్ట్‌ఫ్రంట్ ఆచీతూచి అడుగులు వేస్తూ తన బలాన్ని పెంచుకునే స్థితిలో ఉంది. దీనిని పునరుజ్జీవనం గా అనలేం కానీ, పూర్తిగా తోసిపుచ్చలేం. కోల్‌కతా, అనేక జిల్లాలలో లెఫ్ట్‌ఫ్రంట్ ఓట్ల షేర్ మెరుగైంది. టిఎంసి, బిజెపి రెండింటి పట్ల భ్రమలు కోల్పోయిన ఒక వర్గం పాలక పక్షానికి ప్రత్యామ్నాయంగా కాకుండా రాజకీయ శూన్యం భర్తీ చేసేదిగా వామపక్షం వైపు చూస్తోంది. చాలామంది యువకులు, యువ ఓటర్లు, ముఖ్యంగా విద్యార్థులు, తొలిసారి ఓటు హక్కు పొందిన వారు వామపక్షాల వైపు మొగ్గుచూపుతున్నారు. వామపక్షం పాలనలో నిబద్ధతతో పని చేసిన పాలనా వ్యవస్థలను జ్ఞప్తి చేసుకుంటున్నారు. వామపక్షాలు గతంపై ఆధారపడకుండా, నిరుద్యోగం, ఆర్థిక అనిశ్చితి, సామాజిక ఆందోళనలను ఎదుర్కొంటున్న ఈ తరానికి తమ పాలన ఎలా ఉంటుందో వ్యక్తపరచి, నచ్చచెప్పడం, సందర్భోచితంగా మారడం అవసరం. 2026 ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభంజనం వచ్చే అవకాశం లేనందున, సంప్రదింపులే కీలకం కాగలవు. సంఖ్యాపరంగా, సంస్థాగత కోణంలోనే కాక, పాలనాపరంగా టిఎంసి అధికారం వల్ల సంక్రమించిన ప్రయోజనాన్ని నిలుపుకుంటుంది. మమతా బెనర్జీ వ్యక్తిగత చరిష్మా, వ్యక్తిగతంగా ప్రజలతో మమేకమయ్యే స్వభావం, నాయకత్వం, సంక్షేమ పథకాలు ఆ పార్టీకి కొండంత బలం. బిజెపికి కేంద్రంలో జాతీయ స్థాయిలో అధికారం వల్ల ప్రయోజనం. ఎన్నికలను ఓ సైద్ధాంతిక పోరుగా మార్చే సామర్థ్యం, సమృద్ధిగా ఆర్థిక పరమైన వనరులు, మార్పు తీసుకు వస్తామని చేస్తున్న వాగ్దానం, ప్రజలను ఒప్పించే సామర్థ్యం అండగా నిలవవచ్చు. వామపక్షాలు, కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల పరమైన వాదన కన్నా, నైతికపరమైన భరోసా కల్పించేందుకు సిద్ధమవుతున్నాయి. రాజకీయంగా తెరమరుగయ్యారని భావించే ఓటర్లకు, తక్షణ విజయం కోసం కాకపోయినా, ఆ రెండు పక్షాలకు వ్యతిరేకంగా ఓటు వేయాలనుకునే వారికి తగిన ప్రత్యామ్నాయంగా నిలిచే అవకాశం ఉంది. బెంగాల్ ఓటర్లు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. బెంగాల్ లో రాజకీయపరమైన ప్రశ్న ఏమిటంటే, ఎవరు ఎవరిని ఓడించగలరు అని కాదు. ఎవరు విశ్వసనీయమైన పాలన అందించగలరు అన్నదే. టిఎంసి ఓటర్లను గతంలో మాదిరిగానే ఆదరించమని అడుగుతోంది. బిజెపి తమను ప్రత్యామ్నాయంగా భావించి ఓటర్లు రిస్క్ తీసుకోవాలని కోరుతున్నాయి. ఇక వామపక్షాలు తమను కూడా మరో ప్రత్యామ్నాయంగా చూడాలని అడుగుతున్నాయి. ఈ ప్రతిపాదనలు ఏవీ విజయానికి హామీ ఇవ్వవు. సాధారణ రాజకీయాల విభిన్న దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి. పశ్చిమ బెంగాల్ ఈ ఎన్నికల్లో రెండు వ్యక్తిత్వాలలో దేనివైపు మొగ్గుచూపాలనే రాష్ట్రంగా కాక, సొంత రాజకీయ భవిష్యత్ కోసం చర్చిస్తున్న రాష్ట్రంగా నిలుస్తున్నది. ప్రజలలో చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఈ చర్చలు ఎలా ఉన్నాయంటే, 2026 తర్వాత పరిస్థితులు ఎలా ఉంటాయి. 15 ఏళ్లగా పాతుకుపోయిన సర్కార్‌ను కూల్చివేసి, కొత్త రాజకీయ వ్యవస్థను నిర్మిస్తే, వచ్చే ఐదేళ్లు ఆ క్రమం పరిణతి చెందుతుందా, మార్పు సాధ్యమవుతుందా, కొత్త దశ పోటీకి

# కనిపించని పవన్ మార్క్..

**విజయవాడ – సూర్య వాస్తవం**



ఏపీలో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే ఏడాదిన్నర దాటింది. జనవరి నాటికి దాదాపు 19 నెలలు పూర్తవుతాయి. ప్రజలు ఇచ్చిన ఐదేళ్ల అధికార కాలంలో మూడో వంతు కాలం గడిచిపోతుండటంతో, ప్రభుత్వ పనితీరుపై సహజంగానే చర్చలు మొదలయ్యాయి. ప్రభుత్వ పనితీరు ఒక వైపు అయితే, కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీ పాత్ర మరో ముఖ్య అంశంగా మారింది.కూటమిలో పెద్దన్న పాత్రను టీడీపీ సమర్థంగా నిర్వహిస్తోందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి నాయకుడిగా ఉన్నందున, పాలనలో టీడీపీ మాటే ఎక్కువగా నడుస్తోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. పేరు మాత్రం కూటమి ప్రభుత్వం అయినా, వాస్తవంగా నిర్ణయాలన్నీ టీడీపీ నుంచే వస్తున్నాయన్న భావన ప్రజల్లో ఉంది.పవర్ స్టార్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాత్రపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. 2024 ఎన్నికల ముందు ఆయన రాజకీయ ప్రస్థానం చాలా ఉత్సాహాన్ని కలిగించింది. అయితే ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత ఆయన ప్రభావం ఎంత వరకు కనిపిస్తోంది అన్నది ప్రశ్నగా మారింది. డిప్యూటీ సీఎం హోదాతో పాటు కీలక శాఖలు ఆయన వద్ద ఉన్నప్పటికీ, విధానపరమైన నిర్ణయాల్లో ఆయన ముద్ర స్పష్టంగా కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రోటోకాల్ పరంగా చూస్తే పవన్‌కు ముఖ్యమంత్రి స్థాయి గౌరవం ఉంది. చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం తర్వాత ఆయన ఫోటో దర్శనమిస్తోంది. అధికార పరంగా ఎలాంటి లోటు లేకపోయినా, ఆ అధికారాన్ని వినియోగించి తన ఆలోచనలను ఎంతవరకు అమలు చేయగలుగుతున్నా రన్నదే అసలు చర్చ. “సీజ్ ది షిప్” వంటి వ్యాఖ్యలు వార్తల్లో నిలిచినా, వాటి ఫలితాలు ప్రజలకు స్పష్టంగా కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.అలాగే రేషన్ బియ్యం అక్రమ రవాణా, స్థానిక సమస్యలపై పవన్ స్పందించిన సందర్భాలు ఉన్నా, ఆ తర్వాత వాటిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏ స్థాయిలో ఉన్నాయన్నది స్పష్టత లేనిదే అని అంటున్నారు. భీమవరం ప్రాంతంలో జూదం అంశంపై విచారణ కోరిన విషయం కూడా చర్చకు వచ్చినా, దాని తుది ఫలితం ఏమిటన్నది తెలియరాలేదు.ఎన్నికల సమయంలో జనసేన ఇచ్చిన హామీల విషయానికి వస్తే, యువతకు పెట్టుబడి సహాయం, ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు వంటి అంశాలు ఇప్పటి వరకు అమలులోకి రాలేదన్న అభిప్రాయం ఉంది. అలాగే పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో పవన్ సమన్వయం ఎంతవరకు కొనసాగుతోంది అన్నదానిపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మొత్తానికి కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ స్థానం ఉన్నతమైనదే అయినా, రాజకీయంగా గానీ, ప్రజా విధానాల పరంగా గానీ ఆయన “మార్క్” ఇంకా స్పష్టంగా కనిపించలేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రాబోయే కాలంలో అయినా జనసేన ప్రభావం పాలనలో కనిపిస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

# అడ్డంగా బుక్కైన ఎమ్మెల్యే

**తిరుపతి – సూర్య వాస్తవం**



తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రాజకీయాల్లో కలకలం రేపిన జనసేన కార్యకర్త శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్య కేసు కీలక మలుపు తిరిగింది. ఏడాది కాలంగా మిస్టరీగా, రాజకీయ ఆరోపణల నడుమ సాగుతున్న ఈ కేసు విచారణలో చెన్నై పోలీసులు దూకుడు పెంచారు. ఈ హత్యతో సంబంధం ఉందన్న అనుమానాలు, మృతుడి వీడియో వాంగ్మూలం ఆధారంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని విచారించేందుకు చెన్నై పోలీసులు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదే జరిగితే జిల్లా రాజకీయాల్లో పెను సంచలనం ఖాయం గా కనిపిస్తోంది. ఈ కేసులో ప్రాథమికంగా జనసేన మాజీ ఇన్‌ఛార్జి కోట వినుత, ఆమె భర్త కోట చంద్రబాబులను నిందితులుగా భావించినప్పటికీ, మృతుడు రాయుడు చనిపోవడానికి ముందు చిత్రీకరించిన ఒక వీడియో ఇప్పుడు విచారణను మరో మలుపు తిప్పింది. సుమారు 19.42 నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియోలో రాయుడు సంచలన విషయాలను వెల్లడించారు. తనను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రలోభపెట్టారని, తన అనుచరుడు సుజిత్‌రెడ్డి ద్వారా సంప్రదింపులు జరిపారని రాయుడు ఆ వీడియోలో పేర్కొన్నట్లు సమాచారం. ముఖ్యంగా కోట దంపతులను రోడ్డు ప్రమాదంలో అంతమొందించాలని తనపై ఒత్తిడి తెచ్చినట్లు రాయుడు చెప్పడం గమనార్హం. ఈ వీడియోనే ఇప్పుడు ఎమ్మెల్యే మెడకు చుట్టుకునేలా కనిపిస్తోంది.గతంలో ఈ కేసులో అరెస్టయిన కోట వినుత, చంద్రబాబులు మొదటి నుంచి తాము నిర్దోషులమని వాదిస్తూనే ఉన్నారు. రాయుడు హత్యలో తమ ప్రమేయం లేదని, ఇదంతా రాజకీయ కుట్రలో భాగంగా తమను ఇరికించే ప్రయత్నమని వారు ఆరోపించారు. దీని వెనుక ఎమ్మెల్యే బొజ్జల హస్తం ఉందన్నది వారి ప్రధాన ఆరోపణ. ఇప్పుడు రాయుడి వీడియో బయటకు రావడం, అందులో బొజ్జల పేరు ప్రస్తావనకు రావడంతో కోట దంపతుల వాదనకు బలం చేకూరుతోంది. ఈ నేపథ్యంలోనే కోట దంపతుల వాంగ్మూలాన్ని, రాయుడి వీడియోను సాంకేతిక ఆధారంగా తీసుకుని చెన్నై పోలీసులు ఎమ్మెల్యేను విచారించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాళెం గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త శ్రీనివాసులు అలియాస్ రాయుడు గతేడాది జులై 7న అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. జులై 7న అదృశ్యమైన రాయుడి మృతదేహం మరుసటి రోజు చెన్నైలోని కూవం నదిలో తేలింది. అప్పట్లో ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కేసు నమోదు చేసిన చెన్నై పోలీసులు దర్యాప్తు చేపట్టి కోట వినుత దంపతులతో పాటు వారి అనుచరులు గోపి, కారు డ్రైవర్ షేక్ దాసన్, శివకుమార్‌లను అరెస్టు చేశారు. అయితే, ఇది కేవలం వ్యక్తిగత కక్షల వల్ల జరిగిన హత్య కాదని, దీని వెనుక పెద్ద రాజకీయ హస్తం ఉందన్న అనుమానాలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి.ఈ కేసులో ఇటీవల జనసేనకే చెందిన పేట చంద్రశేఖర్‌ను పోలీసులు విచారించారు. ఆయన నుంచి సేకరించిన సమాచారం, రాయుడి వీడియో, కోట దంపతుల ఆరోపణలన్నింటినీ క్రోడీకరించుకున్న చెన్నై పోలీసులు.. తదుపరి చర్యగా ఎమ్మెల్యే బొజ్జలకు సమన్లు జారీ చేసే అవకాశం ఉంది. అయితే, బొజ్జల సుధీర్‌రెడ్డి మాత్రం ఈ ఆరోపణలను గతంలోనే ఖండించారు. రాయుడి హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కానీ, సాక్ష్యాధారాలు వేరేలా ఉండటంతో పోలీసుల చర్య ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది.ఒక కార్యకర్త హత్య కేసులో ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యే విచారణకు హాజరు కావాల్సి రావడం రాజకీయంగా ఆయనకు ఇబ్బందికర పరిణామమే. ఒకవేళ రాయుడు వీడియోలో పేర్కొన్నట్లుగా.. కోట దంపతుల హత్యకు కుట్ర జరిగిందని రుజువైతే, ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనం సృష్టిస్తుంది. ఇది కేవలం హత్య కేసుగానే కాకుండా, రాజకీయ ప్రత్యర్థులను అంతమొందించేందుకు జరిగిన కుట్రగా మారే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో చెన్నై పోలీసుల విచారణలో ఇంకెన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయో వేచి చూడాలి.

# వైసీపీకి మరో తలనొప్పి

**ఏలూరు – సూర్య వాస్తవం**



వైఎస్ఆర్‌సీపీకి దేవుడే దిక్కయ్యాడు. అది కూడా హిందూ దేవుళ్లే దిక్కయ్యారు. ఎందుకంటే రాజకీయాలు చేయడానికి. ఎక్కడ ఏ చిన్న అంశం జరిగినా పెద్దవివాదం చేసేందుకు వచ్చేస్తున్నారు. ఆ వివాదంతో హిందువుల్ని తమ వైపు తిప్పుకోవాలని అనుకుంటున్నారేమో కానీ.. వారు దేవుడితో చేస్తున్న రాజకీయమే హైలెట్ అవుతోంది. ఓ క్రిస్టియన్ నేతృత్వంలో ఉన్న పార్టీ హిందువుల్ని.. హిందూ దేవుళ్లను చులకన చేయాలని చూస్తోందన్న ఆరోపణలకు కారణం అవుతోంది. కానీ వైసీపీ నేతలు మాత్రం ఈ విషయాన్ని గుర్తించలేక తమ గుడ్డెద్దు చేలో పడిన తరహా రాజకీయాలు తాము చేసుకుటూ పోతున్నారు. మనుషుల్లో రకరకాల మనస్థత్వాలు ఉన్న వారు ఉంటారు. కోపంతో..కసితో..కక్షతో తాము ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో నేరాలు చేసేవారు ఉంటారు. అలాంటి వాడొకడు..ద్రాక్షామంలో శివలింగాన్ని ధ్వంసం చేశాడు. ఓ పూజారిపై కోపంతో .. ఆ శివలింగాన్నిఆ పూజారి రోజూ పూజలు చేస్తాడన్న కారణంతో ఆ శివలింగాన్ని ధ్వంసం చేశాడు. అతను కూడా శివభక్తుడే .కానీ ద్వేషంతో అతని కళ్లు మూసుకుపోయి ఘోరం చేశాడు. దానికి అతను శిక్ష అనుభవిస్తాడు. కానీ ఈ ఘటనతో రాజకీయం చేయాలనుకున్న వైసీపీ .. అంత కంటే పెద్ద తప్పిదం చేసింది. దేవుడికి జరగాల్సిన కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీన్ని రాజకీయం చేయాలనుకుంది.హిందూ దేవుళ్ల విషయంలో వైసీపీ ఎలాంటి జోక్యం చేసుకున్నా అది ఆ పార్టీకి పెను సమస్యగా మారుతుంది. ఆపార్టీ బ్యాక్ గ్రౌండ్ అలాంటిది. ఆ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో టీటీడీని ఎంత భ్రష్టుపట్టించారో మరో ఇరవై ఏళ్ల వరకూ హిందువులు మర్చిపోయారు. ఉద్ధృతంగా సాగిన మత మార్పిళ్లకు జగన్ ప్రభుత్వం ఎలా సహకరించిందో కూడా మర్చిపోరు. వైసీపీ నేతల్లో చాలా మంది హిందువులు ఉంటారు. దేవుడిపై అమితమైన భక్తిని చూపిస్తూ ఉంటారు. కానీ వారే దేవుడిని దోపిడీ చేశారు. హిందూత్వాన్ని కించపరిచారు. ఇలాంటివన్నీ ప్రజల ముందు ఉన్నాయి. వైసీపీ నేతలు ఇప్పుడు తాము హిందూత్వాన్ని కాపాడుతామని.. కూటమి ప్రభుత్వంలో ఏదో జరిగిపోతుదంని వస్తే ప్రజలు నమ్మరు. ఏమైనా చేసినా అది వైసీపీ నేతలే చేసి ఉంటారని అనుమానిస్తారు. వారి ఇమేజ్ అలాంటిది.వైసీపీ నేతలు దేవుడ్ని నమ్ముకోవాలి. ఏ దేవుడ్ని నమ్ముతారో ఆ దేవుడిక్ ప్రార్థనలు చేయాలి. పూజలు చేయాలి. కానీ రాజకీయం చేయకూడదు. వివాదాలు సృష్టించి రాజకీయం చేస్తే మొదటికే మోసం వస్తుంది. ఇప్పటికే వారు దేవుడికి చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. కర్మప్రకారం శిక్షలు అనుభవించాల్సిందే. ఆ శిక్షలు అనుభవిస్తున్నారు కూడా. అందుకే.. ఇప్పటికైనా తెలుసుకుని వైసీపీ నేతలు.. దేవుడిపై కుట్రలు చేయడం.. సంబంధం లేని అంశాలతో హిందూత్వాన్ని కించపరిచేలా చేయడం మానుకుంటే.. దేవుడి ఆగ్రహానికి గురి కాకుండా ఉంటారన్న సలహాలు సొంత పార్టీ నుంచే వస్తున్నాయి

## చౌడేశ్వరి అమ్మవారికి విశేష పూజలు

### - ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన సాక్షిమాత, కాశి విశాలాక్షి అయిన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారం పురస్కరించుకుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం అమ్మవారు విశేష పూల అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకించి ఆలయున రాహుకాల దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్, అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ ప్రతి శుక్ర, పౌర్ణమి, అమావాస్య రోజున అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు. ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసినటువంటి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ,భక్తదులందరూ పాల్గొన్నారు

## బోనాల గ్రామంలో పల్లె పండుగ 2.0..

### - అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన తుంగభద్ర ప్రాజెక్ట్ హై లెవెల్ కెనాల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి





**లింగాల - సూర్య వాస్తవం :** లింగాల మండలంలోని బోనాల గ్రామంలో 'పల్లె పండుగ' ఉత్సవాలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలోని పల్లెల రూపురేఖలు మార్చడమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన ఈ పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా, గ్రామంలో నూతనంగా నిర్మించనున్న క్యాపిటల్ షెడ్ పనులకు భూమి పూజ నిర్వహించారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బిటెక్ రవి సూచనల మేరకు, మారెడ్డి జోగిరెడ్డి ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ,లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నామని, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని కొనియాడారు. బిటెక్ రవి సహకారంతో పులివెందుల నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల సింగిల్ విండో సోసైటి అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, గ్రామ అధ్యక్షుడు, మండల అభివృద్ధి అధికారి ఎంపీడీవో, శ్రీనివాస్ రెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ గంగరాజు మరియు ఇతర ముఖ్య నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు. అధికారులు పనులను పర్యవేక్షిస్తూ, నిరీ?త సమయంలోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.

## కొత్తపట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ



**వేముల- సూర్య వాస్తవం:** వేముల మండలం పెండ్లూర్ గ్రామంలో ప్రభుత్వ రాజ ముద్ర తో కూడిన పట్టదారు రైతు పాసు పుస్తకలు తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్ల శేషా రెడ్డి, కల్లూరు. చంద్రవర్ధన్ రెడ్డిలి (మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్), చంద్రసేనా రెడ్డి, ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందరరేగా టిడిపి నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం

ప్రజా సంక్షేమమే ముఖ్య లక్ష్యంగా పాలన సాగిస్తుందన్నారు.. గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఫోటోలతో జారీ చేసిన పాసుపుస్తకాల్లో తప్పిదాల వలన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.. అన్ని ఇబ్బందులను అధిగమించి జగన్ బొమ్మ స్థానంలో ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్ తో కూడిన పాస్ బుక్ లను రైతులకు నేడు అందజేస్తున్నామన్నారు. నేటి నుంచి ఈనెల 9 వరకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అవేంద్రా రెడ్డి, ఓబుళరెడ్డి, రామక్రిష? రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, మారుతి, సుగుణాకర్ రెడ్డి, ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సరస్వతి దేవిగా కటాక్షించిన వాసవి మాత





**వేంపల్లి - సూర్య వాస్తవం :** వేంపల్లె పట్టణంలోని మెయిన్ బజార్లో వెలసిన 121 సంవత్సరాలు చరిత్ర గల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ధనుర్మాసం పూజలు అత్యంత వైభవంగా కొనసాగుతునాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా ధనుర్మాసం 3వ శుక్రవారం పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందరరేగా మూల విరాట్ అమ్మవారిని శ్రీ సరస్వతీ దేవిగా, ఉత్సవమూర్తి అమ్మవారిని పుష్పక విమానంలో బంగారు చీరతో కొలువుతీర్చి భక్తులకు దర్శనం కల్పించామని తెలిపారు. ఆలయంలో సూర్యోదయానికి ముందు ఏకా వర్తి,ద్వితీయా వర్తి,తృతీయా వర్తి,పంచా వర్తి, నక్షత్ర, రథ, కుంభ హారతులతో పాటు మహా మహా మంగళ హారతి వేద మంత్రోచ్చారణతో నిర్వహించామన్నారు. ధనుర్మాసంలో ప్రతి శుక్రవారం ప్రత్యేక అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే వాసవి మాతను పల్లకిలో కూర్చోబెట్టి భుజాల మీద ఆలయంలో ప్రాకారోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. తాత్కాలిక ఉభయదారులుగా బైరిశెట్టి బాల గంగాధర్, రాయవరం సుబ్బు,బోనగిరి రామలింగయ్య పూజలు నిర్వహించారన్నారు. వేంపల్లె పట్టణ ఆర్యవైశ్య మహిళలు సరస్వతీ నామవాలి, వాసవి అష్టోత్తర నామావలి పారాయణం చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మిట్టా మోహన్ రావు,ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు రాయవరం సుబ్బు, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం,శ్రీ వాసవి కళ్యాణ మండపం, ఆర్యవైశ్య మహిళా మండలి, తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# అమలు కాని హామీలు 2026లోనైనా అమలయ్యేనా?

### - డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి - సూర్య వాస్తవం :** సూపర్ సిక్స్ హామీలలో అమలు కాని హామీలు కనీసం 2026 లోనైనా అమలయ్యేనా అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి,జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వచ్చేటందుకు సూపర్ సిక్స్ హామీలు ప్రధానమన్నారు. ప్రజలు నమ్మి ఓట్లు వేశారు కూటమి అధికారంలోకి వచ్చింది అధికారంలోకి వచ్చి 18 నెలలైనా సూపర్ సిక్స్ హామీలలో ప్రధానమైన హామీలు అమలు చేయకపోవడం శోచనీయం.

**నిరుద్యోగ భృతి**

కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు 3000 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి అధికారంలోకి వచ్చి 18 నెలలైనా ఈ హామీ అమలు కాలేదు.నెలకు 3000 రూపాయలు కాదు కదా మూడు రూపాయలు కూడా ఇవ్వలేదు. ఈ 18 నెలల కాలంలో ఒక్కొక్క నిరుద్యోగికి 54 వేల రూపాయలు చొప్పున కూటమి ప్రభుత్వం ఎగొట్టింది రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. ఈ విధంగా యువతను నమ్మించి మోసగించింది కూటమి ప్రభుత్వం.

**ఆడబిడ్డ నిధి**

కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే 19 - 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు ఆడబిడ్డ నిధి కింద నెలకు 1500 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి అధికారంలోకి వచ్చి 18 నెలలైనా ఈ హామీ అమలు కాలేదు . నెలకు 1500 రూపాయలు కాదు కదా 15 రూపాయలు కూడా ఇవ్వలేదు.రాష్ట్రములో ఈమధ్య వయసుగల ఆడబిడ్డలు కోటి 80 లక్షల మంది ఉన్నారు. ఒక్కొక్కరికి నెలకు 1500 రూపాయలు చొప్పున ఈ 18 నెలల్లో 27 వేల రూపాయలు ఎగ్గొట్టడం జరిగింది.

**50 ఏళ్లకే పెన్షన్**

కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే ఎస్సీ ఎస్టీ, బిసి, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి అధికారంలోకి వచ్చి 18 నెలలైనా ఈ హామీ అమలు కాలేదు దాదాపు 17 లక్షల మంది ఈ పథకం కింద అర్హులు ఉన్నారు. నెలకు 4000 రూపాయలు చొప్పున ఈ 18 నెలల్లో ఒక్కొక్కరికి 72000 రూపాయలు ఎగ్గొట్టడం జరిగింది. ఏరు దాటినంతవరకు ఓడ మల్లన్న, దాటిన తర్వాత బోడి మల్లన్న అన్న విధంగా కూటమి ప్రభుత్వం పనితీరు ఉంది. కనీసం నూతన సంవత్సరం 2026లోనైనా సూపర్ సిక్స్ హామీలలో మిగిలిపోయిన పై మూడు హామీలను అమలు చేయాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం,ప్రసాద్ గౌడ్,విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి ఉత్తన్న తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి బండారు వెంకటేశు,చిన్నకోట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవన నిర్మాణనికి రూ.20 వేలు విరాళం



**పులివెందుల -సూర్య వాస్తవం** :పులివెందుల పట్టణం లోని జగనన్న కాలనీ కి వెళ్లే 100 అడుగుల రోడ్ మార్గంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిర్మిస్తున్న నూతన భవన సముదాయ నిర్మాణం కొరకు పట్టణానికి చెందిన కడియాల లక్ష్మీనారాయణ 20 వేల రూపాయలు విరాళం మొత్తాన్ని శుక్రవారం సేవాసమితి అధ్యక్షులు రాజు కి అందజేశారు. ఈ సందర్భంగా కడియాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు గా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తు లు, కోవిడ్ లాంటి సేవలు మరువలేనివి అంతేకాకుండా విద్య, వైద్య రంగాలతో పాటు అన్ని సామాజిక సేవలు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మరింత విస్తృతి కొరకు భవన సముదాయం ఎంతైనా అవసరం ఉంది. సామాజిక సేవలో భాగంగా నావంతు బాధ్యతగా ఈ విరాళం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తమ సంస్థ తరపున నిర్మిస్తున్న నూతన భవన సముదాయ నిర్మాణం లో భాగస్వాములైన కడియాల లక్ష్మీనారాయణ కి స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సేవాసమితి సభ్యులు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## లింగాల మండలంలో భూమి రీ సర్వే పనుల ప్రారంభం



**లింగాల -సూర్య వాస్తవం :** క్షేత్రస్థాయిలో భూ వివరాల్లో తలెత్తిన లోపాలను సరిచేసి వాస్తవికతను యజమానులకు తెలియజేయాలన్న సంకల్పంతో రీ సర్వే కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని రెవెన్యూ సిబ్బంది పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం లింగాల గ్రామంలో శుక్రవారం రీ సర్వే పనులను అధికారులు ప్రారంభించారు. రీ సర్వే లో భాగంగా ఈ రోజు ఉదయం ఎమ్మార్వో ఆఫీస్ సమీపంలోనీ పొలం వద్ద టెంకాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి రీ సర్వే ని మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సర్వేయర్ రియాజ్, మండల సర్వేయర్ పార్వతమ్మ, ఆర్ ఐ గంగాధర, విఆర్ఓ నారాయణ, సచివాలయ సర్వేలు హర్ష, ప్రవీణ్, లావణ్య, వీఆర్ఏ రాజు, సర్పంచ్ పార్వతమ్మ, టిడిపి నాయకులు తిరుపాల్ రెడ్డి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## భద్రత మాసోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

### - పులివెందుల డి.ఎస్.పి మురళి నాయక్



**పులివెందుల -సూర్య వాస్తవం :** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, రోడ్డు భద్రత ప్రజలందరి సామాజిక బాధ్యత అని పులివెందుల డిఎస్పి మురళి నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలోని డీఎస్పీ కార్యాలయం నందు 37వ జాతీయ భద్రత మాసోత్సవాల సందరరేగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ తో కలిపి డీఎస్పీ మురళి నాయక్ భద్రత మాసోత్సవాల పోస్టర్లను మరియు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాల గురించి తెలియజేస్తూ సెల్ ఫోన్ మాట్లాడుతూ మరియు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, చేయరాదని, ప్రతి ఒక్కరూ రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటించినప్పుడే ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించి సుఖమయ జీవితానికి దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ డిఎం ప్రేమ్ కుమార్, ఆర్ అండ్ బి అధికారులు మాధవి,జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్. లక్ష్మీనారాయణ

### - పూల బొకేలతో ఆహ్వానించిన సచివాలయ సిబ్బంది

**కడప/అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం :** రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. లక్ష్మీనారాయణని సచివాలయ సిబ్బంది పూల బొకేలతో మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందరరేగా కమిషనర్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరంగా ప్రజలే కేంద్రబిందువుగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో, బాధ్యతాయుతంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.





## డీఈఓ సుబ్రహ్మణ్యంను కలిసిన ప్రెమ్సా ప్రతినిధులు



**మదనపల్లె -సూర్య వాస్తవం:** జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం ను శుక్రవారం ప్రెమ్సా అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రెమ్సా ప్రతినిధులు ప్రసాద్ బాబు, శంకర్, బయ్యారెడ్డి, కేశవ రెడ్డి, సహదేవ రెడ్డి, అశోక్ తదితరులు కలిసి, డీఈఓకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో మదనపల్లె కేంద్రంగా జిల్లా పరిపాలన ప్రారంభం కావడం శుభసూచకమన్నారు. అదేవిధంగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఏర్పాటు కావడం ద్వారా విద్యాప్రమాణాలు మెరుగవు తాయన్నారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని డీఈఓకు విజ్ఞప్తి చేశారు. దీనిపై డీఈఓ స్పందిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని, విద్యాశాఖాభివృద్ధికి అందరూ సహకారం అందించాలని కోరారు. కొత్త ఏడాది 2026లో ప్రజల దశాబ్దాల కల నెరవేరి మదనపల్లె జిల్లా ఏర్పాటు కావడం చారిత్రాత్మక అధ్యాయమని, విద్యాశాఖాధికారులు విద్యార్థులకు ప్రెమ్సా తరపున శుభాకాంక్షలు తెలిపారు.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

### - పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ శ్యాం కుమార్



**పత్తికొండ టౌన్- సూర్య వాస్తవం:** పత్తికొండ మండలం దేవనబండ గ్రామంలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణి చేశారు.పత్తికొండ మండలం దేవనబండ గ్రామంలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణి చేసిన ఎమ్మెల్యే కే ఈ శ్యాం కుమార్ . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజముద్ర, క్యూఆర్ కోడ్ తో కొత్త పాస్ పుస్తకాలను కూటమి ప్రభుత్వం అందజేసింది..వెబ్ ల్యాండ్ లోని వివరాల ప్రకారమే ఎటువంటి తప్పులు లేకుండా పాస్ పుస్తకాల పంపిణీ జరుగుతుందని ఉన్నారు. అయితే అధికారులు పాస్ బుక్ ఇచ్చేటప్పుడు రైతుల వేలిముద్రను తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు.గత ప్రభుత్వ హయాంలో 8వేల గ్రామాల్లోని భూముల రీసర్వే ప్రక్రియ చేపట్టారన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ తోపాటు పాస్ పుస్తకాలపై వైయస్ జగన్ బొమ్మతో భూహక్కు పత్రాలనిచ్చారని చరిత్ర లో ఏ ముఖ్యమంత్రి ఇలా చేయలేదు అని ఒక పిచ్చి తుగ్లక్ పాలన గుర్తు వచ్చేలా చేశారు అని అన్నారు . ఆ విషయం రైతులను ఎంతో ఆందోళనకు గురి చేసిందన్నారు. ఇప్పుడు రాజముద్ర, క్యూఆర్ కోడ్ తో మాత్రమే పాస్ పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని ప్రకటించారు.2026వ సంవత్సరం రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పీఎం నరేంద్ర మోడీ,సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, చూపిన మార్గంలో తాము ముందుకు సాగుతామని తెలిపారు. రాష్ట్రంలోని గ్రామాలు అభివృద్ధి చెందాలని ఏపీని పున: నిర్మించుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భరత్ నాయక్, సాంబశివరెడ్డి ప్రమోద్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, బిజెపి గోవర్ధన్ సంబంధిత అధికారులు, కూటమి నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయులకు పీఆర్సీ వెంటనే ఇవ్వాలి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** పిఆర్సి గడువు ముగిసి రెండు సంవత్సరాల అవుతున్న ఇంతవరకు ప్రభుత్వం పట్టించుకోలేదని వెంటనే పిఆర్సి ఇవ్వాలని పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు సూర్యుడు నాయక్ పేర్కొన్నారు.శుక్రవారం దేవలంపల్లి కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులు క్యాలెండర్లు డైరీలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్రాంతి కానుకగా మరో డిఏ ఇవ్వాలని ఆర్థిక శాఖ అనుమతి కోరినందుకు అభినందిస్తున్నామన్నారు. పిఆర్సి గడువు ముగిసి రెండు సంవత్సరాలు పైగా అవుతున్న గత ప్రభుత్వం వేసిన కమిటీ రద్దుచేసి మరో కమిటీ వేయలేదని ప్రభుత్వం కాలయాపన చేస్తుందని తక్షణమే ఉద్యోగ ఉపాధ్యాయ హౌస్ కోచింగ్ ఉద్యోగులకు పిఆర్సి తక్షణమే ఇవ్వాలన్నారు. అంతేకాకుండా ఐ ఆర్ 30% పైగా ప్రకటించాలన్నారు. కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు పద్ధతి ఉపాధ్యాయులు, ఔట్సోర్సింగ్ సిబ్బందికి అలాగే సర్వ శిక్ష అభియాన్ కింద పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లను క్రమబద్ధకరించాలన్నారు. లేనిపక్షంలో సమాన పనికి సమాన వేతనం టైం స్కేల్ అమలుపరచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కృష?ంరాజు ఉపాధ్యాయులు నాగరాజు భాస్కర్ రెడ్డయ్య రాణి విజయలక్ష్మి రామాంజనేయులు తిరుపాల్రెడ్డి రవి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు

## నూతన పట్టాదారు పాసుపుస్తకాలతో

# రెవెన్యూ సమస్యల పరిష్కారం

- అధునాతన సాంకేతికతతో భూ వివాదాలకు చెక్...
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్
- రైతుల భూ సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం..
- మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష







**మదనపల్లి -సూర్య వాస్తవం:** నూతన పట్టాదారు పాస్ పుస్తకాలతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆధునిక సాంకేతికత జోడింపుతో భూ వివాదాలకు చెక్ పెట్టగలు గుతామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లి గ్రామంలో నిర్వహించబడిన రెవెన్యూ గ్రామ సభల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి మదనపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ శివరాం పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. .. మదనపల్లి కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటు అనంతరం అంకి శెట్టిపల్లి గ్రామంలో మొట్టమొదటి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించడం సంతోషదాయకమన్నారు. మదనపల్లె మరియు చుట్టుప్రక్కల ప్రాంతాలలో ముఖ్యమైన సమస్య భూ సమస్య అని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రిసర్వే కార్యక్రమంలో అధునాతన సాంకేతికత ద్వారా భూ సమస్యలను, వివా దాలను పరిష్కరించ గలుగుతామన్నారు. ఈ అధునాతన సాంకేతికతతో సెంటీమీటర్ కూడా తేడా జరగకుండా రిసర్వే నిర్వహించడం జరుగు తుందన్నారు. అధునాతన సాంకేతికత ద్వారా రైతుకు ఎంత భూమి ఉంది, ఎక్కడ ఉంది తదితర అంశాలను చాలా స్పష్టంగా మరియు సులభంగా గుర్తించగలుగుతామన్నారు. జిల్లా ఏర్పాటు అనంతరం... యాద ృఛికంగా ఈ ప్రాంతంలో ముఖ్య సమస్య అయిన భూ సమస్యపైనే మొదటి కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని భూ సమస్యల పరిష్కారానికి ఇది ఒక నాందిగా ఉంటుందన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందన్నారు. రెవెన్యూ గ్రామ సభలను సచివాలయ స్థాయిలో నిర్వహిస్తున్నామని ప్రజలందరూ ఈ కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. నూతన పట్టాదారు పాస్ పుస్తకాలలో తప్పులు దొర్లితే వాటిని అర్జీ పెట్టుకొని పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ భాష మాట్లాడుతూ...మదనపల్లి కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటు అనంతరం రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాన్ని అంకిశెట్టిపల్లి గ్రామంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీతాన్ని అందించిన నేల మదనపల్లి అని, ఎటువంటి ఉపోద్ఘాతము అవసరం లేదు ప్రాంతం మదనపల్లి అని పేర్కొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారం తోనే రైతులు ఆనందంగా ఉంటారని, కూటమి ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. రెవెన్యూ అధికారులు మరియు సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గత ప్రభుత్వం డీకేటి భూములను స్వప్రయోజనాలకు ఉపయోగించు కున్నారని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం డీకేటి భూములను భూమిలేని రైతులకు అందించిందని ఎంతో పారదర్శకంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మదనపల్లె వాసుల కోరిక మేరకు అన్నమయ్య జిల్లా మదనపల్లి, అని వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ గ్రామసభలను ఈనెల 02 నుండి తొమ్మిదవ తారీకు వరకు నిర్వహిస్తోందని ఈ కార్యక్రమాల ద్వారా రాజముద్ర కలిగిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలు ప్రజలకు అందిస్తోందని పేర్కొన్నారు. మదనపల్లి నియోజకవర్గంలోని అంకి శెట్టిపల్లి గ్రామంలో ఈరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామన్నారు. నూతన పాసు పుస్తకాలలో ఏమైనా తప్పులు దొర్లితే వాటిని వెంటనే పరిష్కరిం చుకోవచ్చన్నారు.

మదన పల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ శివరాం మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో పట్టాదారు పాసు పుస్తకాలపై బొమ్మలు ఉండేవని ఇప్పుడు అలా కాకుండా రాజముద్రతో పాసు పుస్తకాలు ముద్రించి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోం దన్నారు. రైతులు రుణాల కోసం తమ పాసు పుస్తకాలను బ్యాంకులో తాకట్టు పెట్టి ఉంటారని, అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి బ్యాంకర్లకు తెలిపి నూతన పాసు పుస్తకాలను తీసుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం అంకి శెట్టిపల్లి గ్రామానికి చెందిన పలు రైతులకు... జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ మరియు మార్కెట్ యార్డ్ చైర్మన్ చేతుల మీదుగా నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను అందించారు.

## అగ్రహారం పొలాల ప్రభుత్వ భూములలో ఆక్రమణలు, కబ్జాలు



**గార్లదిన్నె -సూర్య వాస్తవం:** గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామపంచాయతీ పరిధిలో అగ్రహారం భూములు అన్ని ప్రభుత్వానికి చెందిన భూములు మరియు దేవాదాయ భూములే వాటన్నిటిని కబ్జాదారులు అక్రమంగా ఆక్రమించుకొని ఇండ్ల స్థలాలకు వెంచర్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారని,ఆర్డీఓకు విచారణ చేసి స్వాధీనం చేసుకోవాలని వినతి పత్రం అందజేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని అగ్రహారం పొలాలు ఉన్న ప్రభుత్వ భూములు, ఖరీఫ్ భూములు మరియు దేవాలయ భూములు అక్రమంగా ఆక్రమించబడుతున్నాయని ఆరోపిస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు ఆర్డీఓకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.గ్రామంలోని పేదలకు చెందవలసిన ఈ భూములను కొందరు పెత్తందారులు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఆక్రమించుకుని వెంచర్లు వేసి స్వంత ఆస్తులుగా మార్చుకున్నారని వారు తెలిపారు. కోట్లు విలువ చేసే భూములైన కల్లూరు స్టేట్ బ్యాంక్ పరిసర ప్రాంతాలలోని అగ్రహారం ఆంజనేయస్వామి దేవాలయం ప్రక్కన సర్వే నంబర్లు 333, 47, 48, 49, 55, 56, 57, 75, 76, 77, 85, 86, 102, 103, 107,109, 117, 118లలో ఈ అక్రమాలు జరిగినట్లు వివరించారు.ఇందులో కొన్ని భూములు దేవాలయాలకు చెందినవిగా రికార్డుల్లో ఉన్నప్పటికీ, వాటిలోనూ అక్రమంగా వెంచర్లు వేసేందుకు సర్వేలు కోరినట్లు సమాచారం ఉందన్నారు. పై భూములన్నీ ప్రభుత్వానికి చెందినవే కావడంతో ప్రైవేట్ వ్యక్తులకు ఎలాంటి హక్కులు కల్పించరాదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆర్డీఓను కోరుతూ, సంబంధిత సర్వే నంబర్లలోని భూములపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి అక్రమ ఆక్రమణలను తొలగించి ఆభూములను ప్రభుత్వ స్వాధీనం చేసుకోవాలని, కబ్జాదారులు,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## డిఐజి కోయ ప్రవీణ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎల్లటూరు శ్రీనివాసరాజు

**కడప/ అన్నమయ్యబ్యూరో- సూర్య వాస్తవం :** కర్నూలు రేంజ్ డీ ఐ జీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్‌ని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాస రాజు



## ఆహార విజ్ఞాన శాస్త్ర- కళాశాలలో జాతీయ సేవా పథకంపై అవగాహన





**పులివెందుల -సూర్య వాస్తవం:** పులి వెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలకు చెందిన నాల్గవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు "జాతీయ సేవా పథకం"లో భాగంగా ఏడు రోజుల పాటు అనగా 02 జనవరి నుండి 08 జనవరి వరకు లింగాల మండలం పెద్దకుడాల గ్రామంలో ప్రత్యేక శిభిరాన్ని నిర్వహిం చనున్నారు. అందులో మొదటి రోజులో భాగంగా జాతీయ సేవా పథకం యొక్క "ప్రత్యేక శిభిరము ప్రారంభోత్సవ కార్యక్రమం" 02 జనవరి అనగా శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమం అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా గ్రామ సర్పంచ్ పి. దేవి, అతిథిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు అంకాల్ రెడ్డి, మహిళా పోలీస్ ఎమ్. ప్రశాంతి విచ్చేసారు. ఈ సందర్భంగా జాతియ సేవా పథకము కార్యక్రమ అధికారులు ఇంజనీర్ నజ్మా మరియు డాక్టర్ జయమ్మ మాట్లాడుతూ... ప్రత్యేక శిభిరంలో భాగంగా ఏడు రోజులు జరగబోయే వివిధ కార్యకలాపాల వివరాలు తెలిపారు. అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన నాల్గొవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు గ్రామ స్థులతో మమేకం అయ్యి వారి సమస్యల పరిష్కారానికి తమ వంతుగా ప్రయత్నిస్తారని గ్రామస్థులకు తెలియచేసారు. ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని అన్నారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు ను అభినందించారు, గ్రామంలో ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లకు పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. గౌరవ అతిధిగా వచ్చిన ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు అంకాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాఠశాల తరపున ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లకు ఈ ఏడు రోజుల ప్రత్యేక శిబిరం నిర్వహించడానికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. మహిళా పోలీస్ ప్రశాంతి మాట్లాడుతూ... ఈ ప్రత్యేక శిబిరం పెద్దకూడాల గ్రామంలో నిర్వహి స్తున్నందుకు కళాశాల వారికి ధన్యవాదాలు తెలిపి, గ్రామస్తులు కూడా ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకుడు డాక్టర్ సాయి శ్రీనివాస్ కార్యక్రమాన్ని ఉద్దేశించి సభలో మాట్లాడారు.

మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా కళాశాల నాల్గొవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు గ్రామంలోని సమస్యలు, వారి జీవన విధానం మీద సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దకుడాల గ్రామస్థులు, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ, కళాశాల జాతియ సేవా పథకము కార్యక్రమ అధికారులు ఇంజినీర్ నజ్మా మరియు డాక్టర్. జయమ్మ, కళాశాల అధ్యా పకులు అరుణ, డాక్టర్ సాయి శ్రీనివాస్, పీ.డి డాక్టర్. రాజశేఖర్ నాల్గొవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్‌లో వున్న ఆర్‌ఓబి పనులపై దృష్టి సారించాలి

**- పట్టదారు పుస్తకాల పంపిణీ పక్కగా నిర్వహించాలి**
**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



**కడప బ్యూరో - సూర్య వాస్తవం :** జిల్లాలో ఇప్పటివరకూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఆర్.ఓ.బీ (రోడ్ ఓవర్ బ్రిడ్జి) పనులపై దృష్టి సారించి అందులో భాగంగా చేపట్టే అన్ని రకాల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండి ప్రధానంగా రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులతో పాటు ఆరోగ్యం (ప్రభుత్వ ఆసుపత్రుల సేవలు, ఎండోమెంట్స్ (దేవాలయాల వద్ద సౌకర్యాలు), రెవెన్యూ, రెవెన్యూ (ఎఫ్-లైన్ సర్వే), వ్యవసాయం (యూరియా లభ్యత), వరి సేకరణ, వాహన పోర్టల్ సేవలు, రవాణా శాఖ, సారథి పోర్టల్ సేవలు, ఫైర్ తదితర అంశాలపై సంబందిత కార్యదర్శులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా చేశారు. ప్రధానంగా జనవరి 2 నుండి 9 వరకు ప్రభుత్వ రాజ ముద్ర, క్యు ఆర్ తో కూడిన పట్టదారు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులతో కలసి పక్కగా నిర్వహించాలనీ కలెక్టర్లకు ఆయన సూచించారు. గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే వచ్చే నెల 10 లోపల పూర్తి చేసేలా చూడాలని, అలాగే డాక్యుమెంట్స్ అప్లోడ్ పై కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరితో పాటు రాజంపేట సబ్ కలెక్టర్ భావన, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు హాజరయ్యారు.

సిఎస్ వీసీ ముగిసిన అనంతరం సంబందిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రధానంగా రైల్వే మార్గాల పరిధిలో నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి శాఖల ఆధ్వర్యంలో ఇప్పటికే ఆమోదం తెలిపిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించిన భూసేకరణ పనులు, పర్యావరణ అమతులు తదితర ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఏడాది లోపు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

అందుకు సంబంధించి ఆర్అండ్ బి ఉన్నతాధికారులు సంబందిత రైల్వే అధికారులను సమన్వయం చేసుకుని తరచు సమీక్ష చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రాజ ముద్ర,క్యు ఆర్ కోడ్ తో కూడిన పట్టదారు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పక్కగా నిర్వహించాలన్నారు. ఫ్యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో ఇంకా మ్యాపింగ్ చేయని ఫ్యామిలీ లను త్వరితగతిన మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రెవెన్యూ అంశాల పై వచ్చే ప్రజాస్పందనలపై, నోటీసులు పై తహాశీల్దార్లు, వీఆర్వోలు బాధ్యత వహించేలా చూడాలన్నారు.

అలాగే పారదర్శకంగా పిజిఆర్ఎస్ అమలు, రవాణా వ్యవస్థలో ప్రయాణికులకు సంత ృప్తికరమైన సేవలు అందించడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు, మాదక ద్రవ్యాల నిరోధం, గ్రామవార్డు సచివాలయాల్లో సేవల మెరుగు.. తదితర అంశాలపై క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై క్రమం తప్పకుండా మీటింగ్స్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు చంద్ర మోహన్, సాయి శ్రీ, జాన్ ఐర్విన్, చెన్నయ్య, సీపీవో హాజరతయ్య, సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## భూమి ఉన్న ప్రతి రైతు పట్టాదారు పాసు పుస్తకాలు పొందాలి

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** భూమి ఉన్న ప్రతి రైతు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పొందాలని తహసిల్దార్ క్రాంతి కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కాకులవరం గ్రామంలో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇచ్చిన పాస్ పుస్తకాలు ఉన్నవారు కొత్త పాస్ పుస్తకాలు పొందాలన్నారు. 529 పుస్తకాలు గాను 75 పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశామని ఆయన తెలిపారు. ఈనెల 2 నుంచి 9 వ తేదీ వరకు అన్ని గ్రామాలకు వెళ్లి పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్ విఆర్ఓ రమణ రైతులు పాల్గొన్నారు.

## దప్పేపల్లి మాజీ సర్పంచ్ ఎం.రెడ్డెమ్మ మృతి

**- నివాళులు అర్పించిన లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్ కుమార్ రెడ్డి**



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** మండలంలోని దప్పేపల్లి గ్రామం వీరారెడ్డిగారిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ఎం.రెడ్డెమ్మ (80) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే హిందూపురం వైఎస్ఆర్సిపి పార్లమెంట్ పరిశీలకులు ఆర్.రమేష్ కుమార్ రెడ్డి మృతురాలి రెడ్డెమ్మ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. మృతురాలు మాజీ సర్పంచ్ రెడ్డెమ్మ గ్రామాభివ ృద్ధికి చేసిన కృషిని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలడి ప్రభాకర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు నెర్సుపల్లి ఎర్రంరెడ్డి, కాలడి వినయ్ కుమార్ రెడ్డి గ్రామ నాయకులు రవిరెడ్డి, నాగిరెడ్డి, సర్పంచ్ కేశవయ్య, బిసి నాయకులు విజయభాస్కర్, బాబు మల్లికార్జున తదితరులు నివాళి అర్పించారు.

# న్యాయస్థానాన్ని అవమానించిన ఎస్ఐలను సస్పెండ్ చేయాలి

## అంబేద్కర్ వేషధారణతో న్యాయవాదుల వినూత్న నిరసన




**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** న్యాయస్థానాన్ని అవమానించిన ఎస్ఐలను సస్పెండ్ చేయాలని న్యాయవాదులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు.అందులో భాగంగా శుక్రవారం పత్తికొండ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణం నుండి పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ మీదుగా గాంధీ విగ్రహం వరకు న్యాయవాదులు రాజ్యాంగ స ృష్టికర్త అంబేద్కర్ వేషధారణలో ఉన్న న్యాయవాదితో కలిసి వినూత్న పద్ధతిలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీకి మానవ హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యూజి. శ్రీనివాసులు మద్దతు తెలిపి మాట్లాడారు. గత డిసెంబర్ 24వ తేదీ పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు యందు సరెండర్ అయ్యేందుకు వచ్చిన ముద్దాయి శివన్నను చిప్పగిరి ఎస్సై సతీష్ కుమార్ మరియు పత్తికొండ విజయ్ కుమార్ లు కాలర్ పట్టుకొని లాకెళ్లడం అన్యాయం అన్నారు. సరెండర్ అయ్యేందుకు వచ్చిన ముద్దాయిని ఇలా లాక్కెల్లడం అన్యాయమని ఓ అడ్వకేట్ అడగడంతో, మీరు ఏమి చేసుకుంటారో చేసుకోండి అని అడ్వకేట్ పై ఎస్సైలు దాడి చేయడం ఏమైనా చర్య అన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుబాబు మాట్లాడుతూ... న్యాయస్థానాన్ని అవమా నించి ముద్దాయిని లాక్కెల్లడంపై న్యాయవాదులు అందరూ కలిసి పతికొండ డిఎస్పి కి ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎస్ఐలను సస్పెండ్ చేయడమే కాకుండా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ విషయంపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల దగ్గర న్యాయవాదులు నిరసనలు తెలుపుతున్నారని వివరించారు. ఎస్ఐలను సస్పెండ్ చేయకుంటే ఆందోళనలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం రాజ్యాంగ స ృష్టికర్త అంబేద్కర్ వేషధారణలో ఉన్న న్యాయవాదికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



## భూ హక్కు కోసమే రీ సర్వే

**గాండ్లపెంట - సూర్య వాస్తవం:** నాలుగో విడత రీ సర్వేలో రైతులందరూ తమ హక్కు పత్రాలను తీసుకొని ఈ సర్వేకి హాజరయ్యారు. గాండ్లపెంట మండలంలోని చామల గొంది, మల్లీ మీద పల్లి గ్రామాలలో జరిగిన రీ సర్వేలో అధికారులతో పాటు రైతులందరూ పాల్గొన్నారు .తమ హక్కు పత్రాలను తీసుకుని అనుభవంలో ఉన్న భూమి పైకి ఆ సర్వే నెంబర్ పైకి గల రైతులందరూ పాల్గొన్నారు. మండల తహసిల్దార్ బాబురావు మాట్లాడుతూ మండలంలోని ఈ సర్వే జరిగే గ్రామాలలో ఎటువంటి సమస్యలున్న తమ ద ృష్టికి తీసుకొస్తే కచ్చితంగా పరిష్కారం చూపుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వే అనురాధ, విలేజ్ సర్వేర్లు రాజశేఖర్, శాంతి, వీఆర్వోలు రామ్మోహన్, చంద్ర, మాజీ మండల కన్వీనర్ కొండయ్య, సర్పంచ్ శివప్ప నాయుడు, ప్రతాపరెడ్డి, చలపతి నాయుడు, రమణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీని కలిసిన కుంచం వెంకటసుబ్బారెడ్డి



**తిరుపతి - సూర్య వాస్తవం:** ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివ శంకర్‌ని శుక్రవారం రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుంచం వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ అభివ ృద్ధి కోసం ప్రత్యేక రాష్ట్రం కోసం శ్రమిస్తున్న తనకు మద్దతు పలకాలని కోరారు. ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివ శంకర్ సారథ్యంలో సంస్థ పురోగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సాథక్ వల్లి, మిట్టా క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కమతంపల్లిలో పాస్ బుక్‌ల పంపిణీ



**గాండ్లపెంట- సూర్య వాస్తవం:** మండలం లోని కమతం పల్లి గ్రామం లో శుక్రవారం రైతులకు పాస్ బుక్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బాబురావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు పాస్ బుక్ పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బాబురావు ఆర్ఐ జాఫర్, మండల టిడిపి కన్వీనర్ గొడ్డువెలగల ప్రసాద్, చిన్నోడు, రామాంజులు రెడ్డి వీఆర్వో లు కిష్టప్ప కంప్యూటర్ ఆపరేటర్ రాజేంద్ర వీఆర్ఎ మల్లికార్జున రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

**నాయుడుపేట - సూర్య వాస్తవం:**
నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో తెలుగుదేశం పార్టీ నాయకులు బల్లి ముత్యాలయ్య రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో మాట్లాడి వారు అందిస్తున్న సేవలను అభినందించారు. అలాగే రోగులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వైద్య సిబ్బందికి రోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



## వృషభచలేశ్వర దేవస్థానం ఈవోగా సుభాష్



**వేంపల్లె - సూర్య వాస్తవం:** శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం గండి క్షేత్రం నందు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కే.సుభాష్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్ 1 గా కమిషనర్ దేవదాయశాఖ విజయవాడ వారు ఉత్తర్వులు ఇచ్చినందున, సదరు ఉత్తర్వులు కే. సుభాష్ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా కమిషనర్ దేవదాయ శాఖ విజయ వాడ జాయినింగ్ రిపోర్టు ఇవ్వడం జరిగినది. గత కార్యనిర్వాహణాధికారి హనుమంతరావు నంద్యాల జిల్లా గ్రూప్ దేవస్థానం లకు గ్రేడ్ 1 కార్యనిర్వహణ అధికారిగా ప్రమోషన్ పైన వెళ్లడం జరిగినది. దేవస్థాన చైర్మన్ పీవీ రమణ ఈ విషయం తెలియజేశారు.

# హెల్మెట్ ధరించండి... సురక్షితంగా ప్రయాణించండి

**- 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల గోడ పత్రికలను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



**కడప బ్యూరో - సూర్య వాస్తవం:** రహదారి భద్రత పై అవగాహన కల్పించడం, ప్రమాదాలు తగ్గించడం, హెల్మెట్, సీటు బెల్ట్ వంటి నిబంధనలను పాటించేలా ప్రోత్సహించడం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా సచివాలయంలోని బోర్డు రూమ్ నందు రవాణా శాఖ ఆధ్వర్యం లో 2026 జనవరి 1 నుండి జనవరి 31 వరకు నిర్వహించనున్న 37 వ జాతీయ రహదారి భద్రత మహెూత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందరరేగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రవాణా శాఖ ద్వారా 37 వ జాతీయ రహదారి భద్రతా మహెూత్సవాలను రోడ్డు ప్రమాదాల నివారణ పై మరియు హెల్మెట్ దారణపై అవగాహన కల్పించేందుకు నిర్వహించడం జరుగుతున్నదన్నారు. నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు 30 శాతం దాకా చనిపోతున్నారని అంచనా కలదని,జిల్లా వ్యాప్తంగా 2020సంవత్సరం లో మొత్తం1175 ప్రమాదాలు జరిగి 457 మంది చనిపోగా అందులో కేవలం ద్విచక్ర వాహనాల ద్వారా 359 ప్రమాదాలు జరిగి 176 మంది చనిపోవడం జరిగిందని అందులో హెల్మెట్ ధరించిన వారే అధిక శాతం అని, హెల్మెట్ పెట్టుకుంటే ఏదైనా ప్రమాదం జరిగినా కూడా తలకు గాయం కాకుండా తద్వారా మరణించ కుండా బయట పడవచ్చునని కాబట్టి వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. సుప్రీంకోర్టు వారు కూడా ద్విచక్రవాహనదారులందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించే విధంగా చట్టాన్ని అమలు చేయాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించడం జరిగిందన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసో త్సవాలను పక్కా ప్రణాళిక తో జిల్లాలో నిర్వహించాలని రవాణాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, జిల్లా ఇన్చార్జి జేసి మరియు డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు, జిల్లా రవాణా శాఖ అధికారి వీర్రాజు, ఎంబీఏలు విజయభాస్కర్, ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో
# నూతన సంవత్సరం, సంక్రాంతి సంబరాలు





**వేంపల్లి - సూర్య వాస్తవం:** పట్టణంలోని స్థానిక శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు నూతన సంవత్సరం సంక్రాంతి సంబరాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ లక్ష్మి కాంతమ్మ తెలిపారు. ఈ సందరరేగా పాఠశాల చైర్మన్ లక్ష్మీ కాంతమ్మ మాట్లాడుతు, నేటి పిల్లల అభిరుచులను బట్టి వారిని ముందుకు తీసుకెల్తున్నామన్నారు. కరస్పాండెంట్ కేశవులు మాట్లాడుతు పాటశాలలో సంక్రాంతి పర్వది నాన్ని అనుసరించి రంగవల్లుల పోటీలు, గాలిపటాల పోటీలు, సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించామని తెలిపారు. మంచి పాటలతో, కళ్ళు చెదిరే స్టెప్పులతో, ఆంధ్రులకు ఇష్టమైన కోలాటంతో అలరించబడిందని అన్నారు. అకడమిక్ డైరెక్టర్ బాబు మాట్లాడుతూ ఈ సమకాలీన, పోటీ ప్రపంచంలో హైస్కూల్ విద్యార్థులు పోటీ పడేలా చేయడానికి మేము నీట్, ఐఐటి కోర్సులను, పాఠశాల స్థాయిలోనే, భవిష్యత్తులో వారికి సహాయపడే డిఫరెన్షియేషన్, ఇంటిగ్రేషన్ వంటి అత్యంత క్లిష్టమైన అంశాలను కూడా మేము బోధిస్తున్నామని అన్నారు. పిల్లల ప్రదర్శనలు చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సమూహం, విద్యార్థిని, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

# సఖి సురక్షను సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గం మహిళలకు ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి



**రాయదుర్గం- సూర్య వాస్తవం:** మహిళల ఆరోగ్య సంరక్షణ, పరిరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సఖి సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగపర్చుకోవాలని మహిళామణులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. మెప్మా ఆధ్వర్యంలో రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన "సఖి సురక్ష" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందరరేగా మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి మహిళకు రూ.5 లక్షల వరకు విలువైన ఆరోగ్య సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఇటీవల కాలంలో క్యాన్సర్ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. వ్యాధి లక్షణాలను ముందే గుర్తించి నిపుణుల సలహామేరకు వైద్యం చేయించుకుంటే ఆ వ్యాధి నుండి బయటపడి ఆరోగ్యవంతమైన జీవితాన్ని కొనసాగించవచ్చని సూచించారు. మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహింపచేయాలన్న ఉదేశ్యంతోనే ప్రభుత్వం సుఖీ సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు సత్య కుమార్, నారాయణలు ఈ కార్యక్రమం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ప్రతి మహిళ ఆరోగ్యవంతంగా జీవించాలన్న లక్ష్యంతో ఈ ఉచిత వైద్య పరీక్షా కేంద్రాలు నిర్వహింపచేయటం జరుగుతోందన్నారు. మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా... రాయదుర్గంలో వెయ్యి మందికి నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. వైద్య పరీక్షలకు హాజరయ్యే మహిళలు ఎటువంటి దాపరికం లేకుండా వారి వారి ఆరోగ్య సమస్యలు, రోగ లక్షణాలు, బాధలు వైద్య నిపుణులకు తెలియజేయాలన్నారు. అప్పుడే ఎటువంటి వైద్య సహాయం అవసరము నిపుణులు నిర్ధారించడానికి వీలవుతుందన్నారు. స్థానిక వైద్య పరీక్షల్లో బయటపడ్డ ప్రాథమిక లక్షణాల ఆధారంగా అవసరమైన వారికి తదుపరి వైద్య పరీక్షలకు సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. తదుపరి అనంతపురంలో నిర్వహించే వైద్య పరీక్షల్లో అవసరమైన వారికి వ్యాధి లక్షణాలను బట్టి మెరుగైన ఆసుపత్రులలో ఉచిత చికిత్స అందిస్తామన్నారు. పేదరికంతో ఇబ్బంది పడుతున్న మహిళలు వారి ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగ పర్చుకోవాలని కాలవ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గాజుల వెంకటేశులు, కౌన్సిలర్ ప్రశాంతి, సంపత్ కుమారి తదితరులు పాల్గొన్నారు.






## జనవరి 7 వ తేదీ నుండి
# పుట్టా ప్రీమియర్ క్రికెట్ లీగ్

**- పుట్టా ప్రీమియర్ లీగ్ టీ-10 క్రికెట్ టోర్నమెంట్ - సీజన్ 2**
**- టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లిఖార్జున రెడ్డి**



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం మండలం నందిపల్లిలో నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 26 - 2026 న తెలుగు దేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో పుట్టా ప్రీమియర్ క్రికెట్ లీగ్ టి 10 నిర్వ హిస్తున్నారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువతకు క్రీడల పట్ల అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో జరుపుతున్నట్లు తెలిపారు. ఈ పుట్టా ప్రీమియర్ క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవానికి మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొంటున్నారని అన్నారు. ఈ పుట్టా క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొనేవారు జనవరి 6వ తేదీ 2026 కంతా ఎంట్రీ పీజు 1500 రూపాయలు చెల్లించి నమోదు చేసుకోవాలని అన్నారు. పుట్టా ప్రీమియర్ క్రికెట్ లీగ్ లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి 50,000 వేలు,ద్వితీయ బహుమతి 30,000 వేలు, తృతీయ బహుమతి 10,000 అందచేస్తారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి కడప జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి అందిస్తున్నారు. వివరాల కోసం ఆర్గనైజర్ వినయ్ నాయుడు, 7702111002 సంప్రదించాలి.

# పోలీసులకు వైసీపీ నాయకుల వినతి



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలో 31 వ తారీకు అర్ధ రాత్రి గుత్తి ఆర్ ఎస్ పాత కోపరేటివ్ బ్యాంకు వద్ద వైయస్ఆర్సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడ మైనది. శుక్రవారం పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి మాజీ కన్వీనర్ హు సేన్ పిరా ఆధ్వర్యంలో గుత్తి పోలీస్ స్టేషన్‌లో అర్జీ ఇచ్చి పిర్యాదు చే యడమైనది 31 వ తేదీన గుత్తి ఆర్ ఎస్ ఏడవ వార్డులో ఫ్లెక్సీను, బసనేపల్లి గ్రామంలో వైయస్ ఆర్సీపీ జండా కట్టను ధ్వంసం చేసి రెండు ఘటనలపై పోలీసు ఎంక్వ యిరీ చేసి బాధ్యతలపై కఠిన చర్య లు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పంచాయతీరాజ్ సెక్రటరీ సివి రంగారెడ్డి జిల్లా నాయకులు రంగస్వామి మున్సిపల్ కౌన్సిలర్లు వాల్మీకి శివ,వరద రాజులు, నరేష్, రామంజి మున్సిపల్ వింగ్ టౌన్ ప్రసిడెంట్ షఫీ,ఎస్సీ సెల్ టౌన్ కన్వీనర్ మల్లికార్జున, ప్రచార టౌన్ కమిటీ ప్రెసిడెంట్ అబ్దుల్ రౌఫ్, గుత్తి టౌన్ యూత్ ప్రెసిడెంట్ తపెలా మురళి,బళ్లారి హరినాథ్ రెడ్డి ఎల్ ఐ సీ హరినాథ్ రెడ్డి మున్సిపల్ వింగ్ వైస్ ప్రసిడెంట్ అరుణ్ కుమార్, భాస్కర్ బాబు,మురళి ఆచారి, బాసినేపల్లి చంద్రశేఖర్ రెడ్డి,రామాంజనేయులు, పూల మస్తాన్, జయరాం, చిన్న బాబు, రవితేజా, పూల మహమ్మద్ పాల్గొన్నారు.

# రాజముద్రతో కూడిన కొత్త పాస్ పుస్తకాల పంపిణీ

**- రైతులకు అందజేసిన అజ్జుగుట్టు రఘునాథరెడ్డి**



**వేంపల్లి - సూర్య వాస్తవం:** వేంపల్లె మండలంలోని ముత్తుకూరు గ్రామంలో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను వేంపల్లె మండల టీడీపీ పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, తహశీల్దార్ హరినాద్ రెడ్డిలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అజ్జుగుట్టు రఘు నాథరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతుల పాస్ పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫోటోలను ముద్రించి రాజకీయ ప్రచారానికి వాడుకున్నారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ సంస్కృతికి స్వస్తి పలికిందని ఆయన పేర్కొన్నారు. రాజకీయ నాయకుల ఫోటోల స్థానంలో ప్రభుత్వ అధికారిక చిహ్నమైన రాజముద్రతో అత్యంత గౌరవప్రదంగా ఈ పుస్తకాలను రూపొందించి రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. భూమిపై రైతులకు ఉన్న హక్కు పత్రాలపై రాజముద్ర ఉండటమే గర్వకారణమని, ఈ మార్పు పట్ల ముత్తుకూరు గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని రఘునాథరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బొరెడ్డి జగన్నాథ్ రెడ్డి, సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ రామసురా రెడ్డి , రెవిన్యూ ఇన్స్ పెక్టర్ లోకేష్, వీఆర్వో లూకా, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# అంకితభావంతో పనిచేసే కార్యకర్తలే పార్టీకి శ్రీరామరక్ష

## -ఎమ్మెల్యే డా.నెలవల విజయ శ్రీ



**నాయుడుపేట- సూర్య వాస్తవం :** అంకిత భావంతో పనిచేసే కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి శ్రీరామరక్ష అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నలవల విజయశ్రీ అన్నారు శుక్ర వారం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగిన పరిపాలన కార్యకర్తల అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందరరేగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి,వారి గుర్తింపునకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటి ఉండి, ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం కృషి చేస్తున్న ప్రతి కార్యకర్త అభినం దనీయుడని అన్నారు. సుపరిపాలన అందించడంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకం అన్నారు. అంకిత భావంతో పనిచేసే ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో తగిన గుర్తింపు,ప్రోత్సాహం ఉంటుందన్నారు. కార్యకర్తల కష్టాన్ని గుర్తించి గౌరవించడం మన బాధ్యత” అని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో కార్యకర్తలు భాగ స్వాములు కావాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసు కెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం నియో జకవర్గ వ్యాప్తంగా సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన 32 మంది కార్య కర్తలకు శాలువాలు కప్పి సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ,



తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకట రమణారెడ్డి, పసల గంగా ప్రసాద్,నానబాల సుబ్బారావు, మైలారి రాజశేఖర్,జివిఆర్ నాయుడు, అవధానం సుధీర్, పోట్లపూడి రాజేష్,పలుకూరు ముత్యాలయ్య, జువ్వలపాటి మస్తాన్, నిత్యా కృష్ణారెడ్డి, కాపులూరు చక్రపాణి, బల్లి ముత్యాలయ్య, ఆబోతుల బాబు, చేవూరు చెంగయ్య, చెందేటి సుజాత, తుపాకుల కన్నమ్మ, సంపూర్ణమ్మ,, లక్ష్మి,పలువురు నాయకులు పాల్గొన్నారు.



# మహిళా భద్రతపై విస్తృత అవగాహన



**కడప క్రైమ్ - సూర్య వాస్తవం:** జిల్లా ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, “మహిళా భద్రత స్పెషల్ డ్రైవ్ మాసం”లో భాగంగా కడప జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, కాలనీలు, పట్టణ ప్రాంతాల్లో పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ అధికారులు శుక్రవారం ప్రత్యక్షంగా గ్రామాలు, కాలనీలను సందర్శించి మహిళలు, యువతులు, బాలికలతో, డ్వాక్రా మహిళలతో ముఖాముఖీగా మాట్లాడి వారి భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ, గౌరవం, హక్కుల పరిరక్షణకు సంబంధించిన భారత న్యాయ సంహిత లోని ముఖ్యమైన చట్టాలు, శిక్షల వివరాలు, వాటి ప్రాముఖ్యతనుసవివరంగా వివరిం చారు.మహి ళలపై జరిగే వేధింపులు, గృహ హింస, బాలికలపై నేరాలు వంటి సంఘటనలు జరిగితే భయపడకుండా వెంటనే పోలీస్ సహాయం తీసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్, సోషల్ మీడియా దుర్విని యోగం, ఆన్‌లైన్ మోసాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని అపరిచిత కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని

వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు.మొబైల్ ఫోన్‌లు, సోషల్ మీడియా వేదికల ద్వారా ఎదురయ్యే ప్రమాదాలను అనుమానం వచ్చిన వెంటనే పోలీస్ సిబ్బందికి లేదా సైబర్ సెల్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.



మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు లేదా సైబర్ మోసాల సమయంలో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ నంబర్లను గుర్తు చేశారు

- డయల్ -112 అత్యవసర పోలీస్ సహాయం
- 1091 - మహిళలపై వేధింపులు
- 181 - గృహ హింస, మహిళా సహాయం
- 1098 - చైల్డ్ లైన్ (పిల్లల రక్షణ)
- 1930 - సైబర్ నేరాల టోల్ ఫ్రీ నంబర్
- సైబర్ మిత్ర - సైబర్ అవగాహన, సహాయం

మహిళల భద్రత పరిరక్షణలో పోలీస్ శాఖతో పాటు ప్రజల సహకారం కూడా అత్యంత అవసరమని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# వైసీపీకి గట్టి దెబ్బ - రాజకీయాల్లో కీలక మలుపు

- అభివృద్ధి బాటలో టీడీపీకి ప్రజల మద్దతు
- కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు ఆకర్షితులై టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు
- టీడీపీలోకి యాభై మందికిపైగా నాయకులు, కార్యకర్తల చేరిక
- సమక్షంలో ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ





**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** నాయుడుపేట పట్టణంలో తెలుగుదేశం పార్టీలోకి భారీ చేరికలు చోటు చేసు కున్నాయి. స్థానిక శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో వైకాపాకు చెందిన యాభై మందికిపైగా నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరి రాజకీయంగా ప్రాధాన్యత కలిగిన పరిణామానికి కారణ మయ్యారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సుపరిపాలన, సూళ్లూరుపేట నియోజకవర్గంలో కొన సాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలే తమ నిర్ణయానికి ప్రధాన కారణమని వారు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డా. నెలవల విజయశ్రీ, పార్టీలోకి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు పసుపు కండువాలు కప్పి ఘనంగా



ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో నాయుడుపేట మున్సిపాలిటీకి చెందిన మాజీ కౌన్సిలర్లు, స్థానికంగా కీలక పాత్ర పోషించిన నాయకులు ఉన్నారు. అలాగే పెళ్లకూరు మండలం రోషనూరు ప్రాంతానికి చెందిన మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయుడుపేట బీడీ కాలనీ, ఎల్.ఏ. సాగరం గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యువత పార్టీలో చేరింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం సమతుల్యంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతుండటంతోనే వివిధ పార్టీలకు చెందిన నాయకులు టీడీపీ వైపు ఆకర్షితుల వుతున్నారని తెలిపారు. పార్టీపై విశ్వాసంతో వచ్చిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని, కార్యకర్తల కృషిని గుర్తించే పార్టీ తెలుగుదేశమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సహజ వ్యవసాయంలో జిల్లాను రాష్ట్రానికే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

**కడప బ్యూరో - సూర్య వాస్తవం:** సహజ వ్యవసాయంలో వైఎస్ఆర్ కడప జిల్లాను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కింద శుక్రవారం చెన్నూరులో జరిగిన మండల స్థాయి ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కడప జిల్లాలో జాతీయ సహజ వ్యవసాయ మిషన్ అమలులో భాగంగా, సహజ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించే లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో మండల సమాఖ్య ప్రత్యేక సమావేశాలు విజయవంతంగా నిర్వహించబడుతున్నాయన్నారు.ఈ సమావేశాలు ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమం ఆధ్వర్యంలో, వ్యవసాయ మరియు అనుబంధ శాఖలు (హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ మొదలైనవి) అలాగే (స్వయం సహాయక సంఘాలు) తో సమన్వయంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశాల్లో రైతులకు సహజ వ్యవసాయ విధానాల ప్రాముఖ్యత, రసాయనాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, నేల ఆరోగ్య పరిరక్షణ, పంట వ్యయం తగ్గింపు, లాభదాయక సాగు, జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం, వృక్షసారాల వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదేవిధంగా, మండల స్థాయిలో అమలు చేయాల్సిన సహజ వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, రైతుల నమోదు, క్లస్టర్ విధానంలో సాగు, మార్కెటింగ్ అవకాశాలు, మహిళా స్వయం సహాయక సంఘాల పాత్ర, వ్యవసాయ-అనుబంధ శాఖల సహకారం వంటి అంశాలపై చర్చలు నిర్వహిం చమన్నారు. ఈ ప్రత్యేక సమావేశాల ద్వారా జిల్లాలో సహజ వ్యవసాయానికి మరింత వేగం చేకూర్చి, రైతుల ఆదాయం పెంపు, పర్యావరణ పరిరక్షణ, వినియో గదారులకు నాణ్యమైన ఆహారం అందించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ జగదీష్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పోలీస్ ఆఫీసర్స్ సంఘం ఈసీ మెంబర్



**అనంతపురం - సూర్య వాస్తవం:** ఏపీ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఈసీ మెంబర్, అనంతపురం 14వ బెటాలియన్ ప్రెసిడెంట్ తలారి పెద్దయ్య అనం తపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్‌కి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# నలుగురు పేకాట రాయుళ్లు అరెస్టు..

## -రూ. 92,950 నగదు స్వాధీనం



**కడప క్రైమ్ - సూర్య వాస్తవం :** చిన్న చౌక్ పి.ఎస్ పరిధిలోని నానా పల్లిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు చిన్న చౌకు సి.ఐ ఓబులేసు తెలిపారు. వారి నుండి రూ.92,950 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు సి.ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చిన్న చౌకు సి.ఐ హెచ్చరించారు. ఎస్.ఐలు రాజరాజేశ్వర రెడ్డి, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# నగరంలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తాం

- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి...
- హెల్మెట్ ధరించకపోతే రూ.1,000 జరిమానా
- కడప ట్రాఫిక్ సి.ఐ సురేష్ రెడ్డి హెచ్చరిక



**కడప క్రైమ్ - సూర్య వాస్తవం:** రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యం హెచ్చరికలు జారీ చేస్తున్నా కొందరు వాహనదారులు అవేవీ పట్టించు కోవటం లేదు. రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం చాలా సందర్భాల్లో ప్రమాదాలకు దారితీస్తుంది. ఈ క్రమంలోనే వై.ఎస్.ఆర్ కడప జిల్లా ఎస్.పి శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ రూల్స్ పాటించని వారి విషయంలో కడప ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమయ్యారు. ఇకపై హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడితే రూ. 1,000 జరిమానా విధిస్తామని శుక్రవారం కడప ట్రాఫిక్ సి.ఐ సురేష్ రెడ్డి తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోయే రిస్క్ మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని ట్రాఫిక్ సి.ఐ సురేష్ రెడ్డి అన్నారు. ఈ క్రమంలోనే నగరంలో వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సి.ఐ సురేష్ రెడ్డి సూచించారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )